ANN తెలుగు

Follow: @ANNTELUGU

14-10-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 309 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

ANN Awards

ANN NEWS NETWORK
DOCTOR AWARDS 2025




## టీడీఎస్ రూల్స్.. కొత్త సెక్షన్: రూ. 20వేలు దాటితే..

2025 బడ్జెట్‌లో ప్రవేశ పెట్టుబడి, చట్టంలో చోటు చేసుకున్న టీడీఎస్‌కి సంబంధించిన అంశాల రూల్స్ గురించి ఈ వారం తెలుసుకుందాం. ఇవన్నీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంటే నడుస్తున్న సంవత్సరానికి అమల్లోకి వచ్చాయి. 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లో పెట్టారు. భాగస్వామ్య సంస్థల్లో భాగస్వాములకు జీతం లేదా పారితోషికం మొదలైనవి ఇవ్వడం పరిపాటి. సెక్షన్ 194 క్యూ కొత్తగా వచ్చింది. సంస్థ చేసే చెల్లింపులు సంవత్సరానికి రూ. 20,000 దాటితే టీడీఎస్ వర్తిస్తుంది.

**ముఖ్యమైన అంశాలు..**

2025 ఏప్రిల్ 1 నుంచి అమలు.. చెల్లింపులు అంటే జీతం, పారితోషికం, వడ్డీ, కమీషన్, బోనస్. సంస్థ నుంచి పార్ట్‌నర్స్ ఇలా డ్రా చేస్తుంటారు. ఒకప్పుడు వీటిని టీడీఎస్ పరిధిలోకి తీసుకురాలేదు. 2025 ఏప్రిల్ 1 నుంచి వీటన్నింటినీ టీడీఎస్ పరిధిలోకి తెచ్చారు. భాగస్వామ్య సంస్థలు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్షిప్‌లకు వర్తిస్తుంది. దీనివల్ల కాంప్లయెన్స్, పారదర్శకత పెరుగుతుందని అంటున్నారు. నిజానికి పిలక ముందే దొరుకుతుంది. ముందర కాళ్లకు బంధం. పైన చెప్పిన ఐదు చెల్లింపులు వెరసి .. ఒక్కొక్కటి కాదు.. అన్నీ జాయింటుగా కలిపి సంవత్సరకాలంలో రూ. 20,000 దాటితే టీడీఎస్ వర్తిస్తుంది. ఎన్నో



విషయాల్లో ఒక్కొక్క చెల్లింపునకు ఒక్కొక్క పరిమితి ఉంది. కానీ ఇక్కడ అన్నీ కలిపి రూ. 20,000 దాటితే, టీడీఎస్ అని అంటున్నారు. ఇది ఇటువంటి చెల్లింపుల మీద ఒక కన్నేసి చూడటమా లేదా కన్నెర్ర చేయడమా తెలియడం లేదు. పార్ట్‌నర్స్ సాధారణంగా విత్‌డ్రా చేస్తుంటారు. దీన్నే సొంత వాడకాలని అంటారు. ఇటువంటి విత్‌డ్రాయల్స్ మీద ఎటువంటి టీడీఎస్ లేదు. ఇక నుంచి ట్యాక్స్ ప్లానింగ్‌పరంగా ఆలోచించి, విత్‌డ్రాయల్స్ చేయండి. చెల్లింపులు చేతికి రావడం, లేదా అకౌంటుకి క్రెడిట్ చేయడం.. ఈ రెండు పద్ధతుల్లో ఏది ముందు జరిగితే అప్పుడు టీడీఎస్ వర్తిస్తుంది. టీడీఎస్ రేటు ఎంత అంటే 10 శాతం. వెరసి చెల్లింపులు రూ. 20,000 దాటితే 10 శాతం చొప్పున టీడీఎస్ చేసి, గవర్నమెంట్ ఖాతాలో జమ చేయాల్సిందే. వెరసి చెల్లింపులు సంవత్సరానికి రూ. 20,000 దాటకపోతే టీడీఎస్ రూల్స్ వర్తించవు. సెక్షన్ 194 క్యూ ప్రకారం.. జీతాలు, పారితోషికం, కమీషన్, బోనస్, వడ్డీ మొదలైన చెల్లింపులు టీడీఎస్ పరిధిలోకి వస్తాయి. పార్ట్‌నర్స్‌కి వారి మూలధనం మీద లేదా అప్పు మీద వడ్డీ ఇచ్చే సంప్రదాయం ఉంది. అందరు పార్ట్‌నర్స్ ఒక సమాన మొత్తం క్యాపిటల్‌గా పెట్టలేరు. అలాగే, అందరూ అప్పు ఇవ్వొచ్చు.. ఇవ్వకపోవచ్చు. అదనంగా పెట్టుబడి చేసినందుకు.. ఆదనపు రాబడే ఈ వడ్డీ. పని చేసినందుకు జీతం ఉంటుంది. స్లీపింగ్ పార్ట్‌నర్స్‌కి జీతం ఉండదు. అలాగే పారితోషికం లాభాల ఆర్జనను బట్టి ఉంటుంది. అలాగే బోనస్సు.. అలాగే కమీషనూ. అంటే బుక్స్ క్లోజ్ చేసి లాభాల్ని తేల్చాలి. మార్చి 31వి వెంటనే తేల్చాలి. గడువుతేదీ ఏప్రిల్ 30. అందుకే బుక్స్ వెంటనే రాయాలి. ఈ కొత్త అంశాల వల్ల బుక్ రాసే ప్రక్రియ సజావుగా, కరెక్టుగా, సకాలంలో పూర్తవ్వాలి. ఎప్పుడో రిటర్న్ వేసే ముందు తీరిగ్గా అకౌంట్లు రాయడం, ఫైనలైజ్ చేయడం కుదరదు. టీడీఎస్ రికవరీ, చెల్లింపులు.. బుక్స్‌లో కనిపిస్తాయి. రిటర్న్‌లు దాఖలు చేయాలి. చివరిగా, పార్ట్‌నర్స్‌కి చెల్లింపులు టీడీఎస్ మేరకు తగ్గుతాయి. క్యాష్‌ఫ్లోలు తగ్గుతాయి. సంస్థలో టీడీఎస్ బాధ్యతలు పెరుగుతాయి. ఈ మేరకు సంస్థలు సిద్ధం కావాలి.

## ట్రాఫిక్ సిగ్నల్స్ ముందే చూపించే ఫీచర్..
# మొదటిసారి బెంగళూరులో..

బెంగళూరు వంటి నగరాల్లో ట్రాఫిక్ అనేది చాలా పెద్ద సమస్య. ఈ సమస్యకు పూర్తిగా నివారించడం కష్టం, కానీ కొంత వరకు పరిష్కరించవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకునే.. లైవ్ ట్రాఫిక్ సిగ్నల్ కౌంట్‌డౌన్‌ను ట్రాక్ చేయడంలో సహాయపడే కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టారు. ఈ ఫీచర్ ప్రస్తుతం బెంగళూరుకు మాత్రమే పరిమితమైంది. రాబోయే రోజుల్లో ఇది ఇతర నగరాలకు కూడా విస్తరించనున్నట్లు సమాచారం. నావిగేషన్ సంస్థ మ్యాప్‌మైఇండియా సహకారమతో.. ఈ కొత్త ఫీచర్స్ రూపొందించారు. మ్యాప్స్ యాప్‌లో లైవ్ ట్రాఫిక్ సిగ్నల్ టైమ్ చూడవచ్చు. మ్యాప్‌మైఇండియా డైరెక్టర్ రోహన్ వర్మ పేర్కొన్నారు. భారతదేశంలో మొదటిసారి ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. ఇది మ్యాజికల్, హెల్ప్‌ఫుల్ అని తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. రైల్వేలు, సమాచార & ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్ & సమాచార సాంకేతిక శాఖ మంత్రి 'అశ్విని వైష్ణవ్' కూడా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో





తాను ఈ ఫీచర్‌ను ఉపయోగిస్తున్న వీడియోను పోస్ట్ చేసి, "స్వదేశీ 'మాప్స్' బై మ్యాప్‌మైఇండియా. మంచి ఫీచర్లు...తప్పక ప్రయత్నించాలి!" అని పేర్కొన్నారు. మ్యాప్స్ యాప్ ఇప్పుడు బెంగళూరులోని ట్రాఫిక్ సిగ్నల్ టైమింగ్ తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. కొత్త ఫీచర్ ప్రస్తుతం వెహికల్ యాక్చుయేటెడ్ కంట్రోల్ (VAC) సిగ్నల్‌లను ఉపయోగించే 169 జంక్షన్‌లలో అందుబాటులో ఉంది. Mappls ఇంటిగ్రేషన్‌తో, సిగ్నల్ స్తంభాలపై కనిపించే అదే కౌంట్‌డౌన్ ఇప్పుడు మొబైల్ స్క్రీన్‌లలో చూడవచ్చు. VAC సిగ్నల్స్ గురించి ప్రధాన ఫిర్యాదులలో ఒకటైన ఊహించలేని వెయిటింగ్ పీరియడ్‌లను పరిష్కరించడమే ఈ కొత్త ఫీచర్ ప్రవేశపెట్టడం వెనుక ముఖ్య ఉద్దేశ్యం అని అధికారులు తెలిపారు. జంక్షన్లకు ముందుగా టైమర్‌లను చూపించడం ద్వారా, ప్రయాణికులు ఆలస్యాన్ని ఊహించవచ్చు, అనవసరమైన హారన్ మోగించడం లేదా లేన్ మార్పులను నివారించవచ్చు.

## బంగారం, వెండి కొనాల్సింది అప్పుడే: కమొడిటీ గురు జిమ్ రోజర్స్

బంగారం, వెండి కొనే విషయంలో భారతీయ మహిళలను చూసి నేర్చుకోవాలంటున్నారు ప్రముఖ కమోడిటీ ఇన్వెస్టర్ జిమ్ రోజర్స్. పెట్టుబడి పాఠాలకు సంబంధించి ఆయన రాసిన పుస్తకం 'స్ట్రీట్ స్మార్ట్స్: అడ్వెంచర్స్ ఆన్ ది రోడ్ అండ్ ఇన్ ది మార్కెట్స్' (Street Smarts: Adventures on the Road and in the Markets) చాలా ప్రసిద్ధి చెందింది. ఇటీవల జిమ్ రోజర్స్ (Jim Rogers) బిజినెస్ టుడేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను బంగారం, వెండిని కలిగి ఉన్నానని, కానీ వాటిని అమ్మే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత ధరల వద్ద కొత్తగా కొనుగోలు చేసే ఆలోచన తనకు లేకపోయినా, ధరలు తగ్గితే మరింత కొనడానికి ఆసక్తిగా ఉన్నానని తెలిపారు.

**రోజర్స్ పెట్టుబడి తత్వం ఇదే..**

తాను మార్కెట్ భవిష్యత్తు గురించి లెక్కలు వేస్తూ కూర్చోనని, ఎప్పుడైతే వస్తువుల ధరలు పడిపోతాయో అప్పుడే ఎక్కువగా కొనుగోలు చేస్తానని జిమ్ రోజర్స్ చెప్పుకొచ్చారు. బంగారం (gold), వెండి (silver) వంటి విలువైన లోహాలు తన వద్ద ఉన్నాయని, అవి తన పిల్లలకు మిగలాలని ఆశిస్తున్నానని చెప్పారు.



ఇటీవల వెండి ధరలు దూసుకుపోతున్న తరుణంలో తానూ కొంత వెండి కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ప్రపంచంలోని చాలా దేశాలు భారీగా డబ్బును ముద్రిస్తున్నాయి. అప్పుల్లో కూరుకుపోయాయి. ఈ నేపథ్యంలో బంగారం వంటి లోహాలు కరెన్సీ డీవాల్యుయేషన్ నుండి తమను తాము రక్షించుకునేందుకు మంచి మార్గమని రోజర్స్ చెప్పారు. 'భారతీయ మహిళలు శతాబ్దాలుగా బంగారం, వెండి కొనుగోలు చేస్తున్నారు. వారికి ఉన్న తెలివితేటలు నేనూ నేర్చుకుంటున్నాను' అని ఉదహరించారు.

**మార్కెట్లపై దృష్టి**

చైనా మార్కెట్లో కొంత ఈక్విటీ ఎక్స్‌పోజర్ ఉన్నప్పటికీ, తన ఇతర పోర్ట్‌ఫోలియోలో చాలా భాగం విక్రయించానన్నారు. ఇటీవల స్టాక్ మార్కెట్లు బలంగా ఉండటాన్ని చూస్తే, తన అభిప్రాయం ప్రకారం ఇది అమ్మే సమయం అని చెప్పారు. జిమ్ రోజర్స్ తరచూ మార్కెట్‌లో వేచి చూసే పెట్టుబడిదారుల సరసన నిలబడతారు. వారు చెబుతున్నది స్పష్టం.. ధరలు పడితేనే కొనండి, ఎప్పుడూ ట్రెండ్‌ను అనుసరించవద్దు. బంగారం, వెండిలో దీర్ఘకాలికంగా పెట్టుబడి పెట్టాలన్నది ఆయన సలహా.

## చిన్న కారు.. పెద్ద డిస్కౌంట్!

2025 ఆర్థిక సంవత్సరంలో 1,98,451 యూనిట్ల అమ్మకాలతో, మారుతి సుజుకి వేగన్ ఆర్.. టాటా పంచ్ వంటి పోటీదారులను అధిగమించి నాలుగోసారి అత్యధికంగా అమ్ముడైన కారుగా తన కిరీటాన్ని నిలుపుకొంది. ఎస్‌యూవీలు డిమాండ్‌లో ఉన్నా, ఈ ప్రాక్టికల్ హ్యాచ్‌బ్యాక్ తన ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొంటోంది. జీఎస్టీ 2.0 అమలుతో మారుతీ సుజుకీ ధరల నిర్మాణాన్ని మారుస్తూ వాగన్ ఆర్ మోడళ్లపై భారీ తగ్గింపులను ప్రకటించింది. ఇది పండుగ సీజన్‌లో బడ్జెట్ కొనుగోలుదారులకు గుడ్ న్యూస్. దీంతో ఈ దీపావళికి కారు కొనాలనుకుంటున్నవారికి మంచి అవకాశంగా భావిస్తున్నారు.




**వాగన్ ఆర్ ధరల తగ్గింపులు**

1.0L LXI (మ్యాన్యువల్) - రూ.5,78,500 నుండి రూ.4,98,900 (రూ.79,600 తగ్గింపు)
1.0L VXI (మ్యాన్యువల్) - రూ.6,23,500 నుండి రూ.5,51,900 (రూ.71,600 తగ్గింపు).
1.2L ZXI (మ్యాన్యువల్) - రూ.6,52,000 నుండి రూ.5,95,900 (రూ.56,100 తగ్గింపు).
1.2L ZXI+ (మ్యాన్యువల్)- రూ.6,99,500 నుండి రూ.6,38,900 (రూ.60,600 తగ్గింపు).
1.0L VXI AMT - రూ.6,73,500 నుండి రూ.5,96,900 ( రూ.76,600 తగ్గింపు).
1.2L ZXI AMT- రూ.7,02,000 నుండి రూ.6,40,900 (రూ.61,100 తగ్గింపు).
1.2L ZXI+ AMT- రూ.7,49,500 నుండి రూ.6,83,900 ( రూ.65,600 తగ్గింపు).
1.0L LXI CNG- రూ.6,68,500 నుండి రూ.5,88,900 ( రూ.79,600 తగ్గింపు).
1.0L VXI CNG - రూ.7,13,500 నుండి రూ.6,41,900 (రూ.71,600 తగ్గింపు).



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL






## కోల్డ్‌రిఫ్ దగ్గు మందు ఎఫెక్ట్..
# తమిళనాడులో ఈడీ సోదాలు

**చెన్నై:** మధ్యప్రదేశ్ 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు కారణంగా 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందును తయారు చేస్తున్న తమిళనాడులోని శ్రీసన్ ఫార్మా సంస్థపై ఈడీ ఫోకస్ పెట్టింది. తాజాగా చెన్నైలో శ్రీసన్ ఫార్మాకు సంబంధించిన ఏడు ప్రాంతాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. వివరాల ప్రకారం.. చిన్నారుల మరణాలకు కారణమైన 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. ఈ నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోమవారం శ్రేసన్ ఫార్మాతో సంబంధమున్న చెన్నైలో ఏడు ప్రదేశాల్లో సోదాలు, తమిళనాడు డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారుల నివాసాల్లోనూ తనిఖీలు చేపట్టారు. మనీలాండరింగ్ చట్టంకింద కేసు నమోదు చేసిన ఈడీ అధికారులు ఈ దాడులు నిర్వహిస్తున్నారు. దగ్గు మందు తయారుచేసిన శ్రేసన్ ఫార్మా యూనిట్ యజమాని రంగనాథన్(73)ను ఇటీవల అరెస్టు చేసిన తర్వాత ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. మధ్యప్రదేశ్‌లో చిన్నారుల మరణాల నేపథ్యంలో శ్రేసస్ ఫార్మా కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలడంతో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అంతేకాకుండగా దగ్గు, జలుబు, జ్వరాలతో వెళ్లిన చిన్నారులకు వైద్యులు కోల్డ్‌రిఫ్ సిరప్‌ను సూచించగా అందులోని విషపదార్థం వల్ల పిల్లల కిడ్నీలు విఫలమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే కేంద్రప్రభుత్వంతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు కోల్డ్‌రిఫ్‌ను నిషేధించాయి.ఇదిలా ఉండగా.. ఔషధ తయారీ సంస్థగా ఈ కంపెనీ కేంద్ర పోర్టల్‌లో రిజిస్టర్ కాలేదని దర్యాప్తులో అధికారులు గుర్తించారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇచ్చే గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ సర్టిఫికెట్ లేకుండానే దశాబ్దాల పాటు ఫార్మా సంస్థ నడిచేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతిచ్చినట్లు తెలిపారు. దీంతో, ఫార్మా కంపెనీ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# తుపాను బీభత్సం..
## 44 మరణాలు.. మేయర్‌పై దాడికి యత్నం




**పొజారికా:**

మెక్సికోలో మధ్య, ఆగ్నేయ ప్రాంతాల్లో తుపాను బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు, వరదలకు సంబంధించిన ఘటనల్లో కనీసం 44 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గల్లంతయ్యారు. వెరాక్రుజ్ రాష్ట్రంలో ఈ నెల 6-9 తేదీల మధ్యలో అత్యధికంగా 54 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో, కజొనెస్ నది పొంగి ప్రవహించింది. శుక్రవారం వేకువజామున పొజారికా వీధుల్లో నాలుగు మీటర్ల మేర వరద ప్రవహించింది. వందల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. తుపాను బీభత్సం కారణంగా పొజారికాలో ప్రజలు బురద నీటిలోనే జీవనం కొనసాగిస్తున్నారు. వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో పరిస్థితిని పరిశీలించేందుకు అక్కడికి వచ్చిన మేయర్‌పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి ప్రయత్నించారు. ఆయన కారులో ప్రయాణిస్తున్న సమయంలో ఆగ్రహంతో స్థానికులు.. మేయర్ వాహనంపై రాళ్లు రువ్వి, బురద చల్లారు. విపత్తు సమయంలో ముందస్తుగా తమను ఎందుకు హెచ్చరించలేదని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరోవైపు.. వర్షాల కారణంగా దేశవ్యాప్తంగా వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ప్రాణనష్టం పెరిగింది. దీంతో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాల గవర్నర్‌లను సమావేశపరిచి అత్యవసర ప్రతిస్పందన ప్రణాళికను నిర్దేశించారు. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.



# ఉద్రిక్తంగా పాక్-అఫ్గాన్ పోరు
### 200 మంది తాలిబాన్ ఫైటర్లను హతమార్చామన్న పాక్
### 58 మంది పాక్ సైనికులను చంపేశామన్న అఫ్గాన్ సర్కార్

**ఇస్లామాబాద్/పెషావర్:** తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ) సంస్థ స్థావరమే లక్ష్యంగా పాకిస్తాన్ జరిపిన దాడులు చివరకు తాలిబాన్, పాక్ మధ్య పోరును మరింత ఉధృతం చేశాయి. పాక్-అఫ్గాన్ సరిహద్దు ప్రాంతంలో ఆదివారం సైతం ఇరు దేశాల పరస్పర దాడుల పర్వం కొనసాగింది. శత్రుదేశానికి భారీ నష్టం వాటిల్లజేశామని అటు అఫ్గానిస్తాన్, ఇటు పాకిస్తాన్ ప్రకటించుకున్నాయి. 200 మందికిపైగా తాలిబాన్ ఫైటర్లను అంతంచేశామని పాకిస్తాన్ ఆర్మీ ఆదివారం ప్రకటించగా తాము 58 మంది పాక్ సైనికులను చంపేశామని అఫ్గాన్ ప్రభుత్వం పేర్కొంది. పాక్‌కు చెందిన 25 ఆర్మీ పోస్ట్‌లను సైతం దాడులను ధ్వంసంచేశామని అఫ్గాన్ సర్కార్ వెల్లడించింది. తమ దాడుల ధాటికి 30 మంది పాక్ సైనికులు రక్తమోడారని వెల్లడించింది. ఈ మేరకు తాలిబాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీహుల్లాహ్ ముజాహిద్ మాట్లాడారు. "మా అఫ్గాన్ ప్రభుత్వానికి కంట్లో నలుసులా తయారైన ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులకు పాకిస్తాన్ ఆశ్రయం కల్పిస్తోంది. పాక్‌లో తలదాచుకున్న ఐఎస్ఐఎస్ ముఖ్యులను మాకు అప్పగించాలి. ఐఎస్‌గ్రూప్ ఒక్క అఫ్గానిస్తాన్‌కే కాదు యావత్ ప్రపంచానికే పెనుముప్పు" అని ముజాహిద్ అన్నారు.

**సరిహద్దు వెంట కాల్పుల మోత**

'ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్తాన్ పరిధిలోని బరామ్చాల్లో సరిహద్దు వెంబడి ఉన్న అంగూర్ అడ్డా, బజౌర్, కుర్రం, డిర్, చిత్రాల్‌లోని పాక్ ఆర్మీ పోస్ట్‌లపై మా బలగాలు దాడులుచేశాయి. డ్యూరాండ్ రేఖ వెంబడి పాక్ పోస్ట్‌లపై తెగబడి పలువురు పాక్ సైనికులను చంపేశాం' అని ముజాహిద్ వివరించారు.



**న్యూఢిల్లీ:**

ఈశాన్య ఢిల్లీలోని జ్యోతి నగర్ ప్రాంతంలో జైన దేవాలయం గోపురం నుండి సుమారు రూ.40 లక్షల విలువైన బంగారు పూత కలశం చోరీ అయ్యింది. ఆలయంలో అమర్చిన సీసీటీవీ కెమెరాల్లో నమోదైన చోరీకి సంబంధించిన రెండు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలివి. జ్యోతి నగర్ ప్రాంత నివాసితులు శుక్రవారం అర్ధరాత్రి భారీ ఎత్తున కర్వా చౌత్ వేడుకల్లో నిమగ్నమై

# బంగారు పూత కలశం చోరీ
### విలువ రూ.40 లక్షలు .. ఢిల్లీలోని జైన దేవాలయంలో ఘటన

ఉన్నప్పుడు ఈ సంఘటన జరిగింది. నిందితుడు విద్యుత్తీగల ఆధారంగా ఆలయం పైకప్పు ఎక్కి, గోపురం పైకి చేరుకున్నాడు. అక్కడున్న బంగారు పూత కలశాన్ని చోరీ చేసి పారిపోయాడు.

**అష్ట ధాతువులతో కలశం తయారీ**

చోరీ అయిన కలశం 'అష్ట ధాతువులు' (ఎనిమిది లోహాల మిశ్రమం)తో తయారైంది. దీని తయారీకి సుమారు 200 గ్రాముల బంగారం వినియోగించారు. కలశం విలువ సుమారు రూ.35-40 లక్షలు ఉంటుందని అంచనా. కలశం సుమారు 25 నుండి 30 కిలోగ్రాముల రాగి, బంగారు పూతతో తయారైందని పోలీసులు తెలిపారు. చోరీపై ఆలయ కమిటీ అధ్యక్షుడు నీరజ్ జైన్ శనివారం ఉదయం ఈస్ట్ జ్యోతి నగర్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. నిందితుడిని పట్టుకోవడానికి గాలింపు బృందాలను ఏర్పాటు చేశామని, అతని కదలికలను తెలుసుకోవడానికి సాంకేతిక నిఘా ఉపయోగిస్తున్నామని పోలీసులు తెలిపారు.

Follow: @ANNTELUGU

14-10-2025

# మహా పత్రిక

ANN తెలుగు

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 309 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




### పోలీసులు సివిల్ పంచాయితీ చేస్తే
# చర్యలు తప్పవు

**డిపార్ట్‌మెంట్‌లో లంచం తీసుకున్నా సీరియస్ యాక్షన్ ఉంటుంది**

**రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి లేఖ**

**హైదరాబాద్, మహా:** పోలీస్ స్టేషన్‌లలో సివిల్ వివాదాలకు తావు లేదని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సివిల్ వివాదాల కోసం సివిల్ కోర్టులు ఉన్నాయని వివరించారు. పోలీస్ స్టేషన్ అడ్డాగా సివిల్ పంచాయితీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలని డీజీపీ ప్రస్తావించారు. యూనిఫాం, అవినీతి ఒకే దగ్గర ఉండవని తేల్చిచెప్పారు. ఒక్క పోలీస్ అధికారి అయినా లంచం తీసుకుంటే డిపార్ట్‌మెంట్ మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పుకొచ్చారు. డిపార్ట్‌మెంట్‌లో లంచం తీసుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల భద్రత పోలీసు ప్రధాన బాధ్యత అని ఉద్ఘాటించారు. పోలీస్ సిబ్బంది వెల్ఫేర్ తన వ్యక్తిగత ప్రయారిటీ అని చెప్పుకొచ్చారు. ఫెయిర్ అండ్ ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ పోలీసింగ్ తన ఫిలాసఫీ అని నొక్కిచెప్పారు.కేసుల విషయంలో బేసిక్ పోలీసింగ్‌తో పాటు టెక్నాలజీని వాడాలని సూచించారు. పేద ప్రజలు ఆపదలో ఉంటే పోలీసులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆపదలో ఆదుకున్న వాళ్లని పేదలు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

మంత్రులు-మాటలు



## రేపు నన్నూ చంపొచ్చు

- తమ్ముడినే చంపాడు.. పదవి కోసం నన్ను కూడా చంపొచ్చు
- మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

04



## కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

04



## మునుగోడులో స్పెషల్ రూల్స్

- బయటి వారొచ్చి టెండర్లు వేస్తే ఊరుకోం
- ఊరిబయటే షాప్.. రాత్రి 8 గంటలకు క్లోజ్
- రాజగోపాల్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

04





## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

**తొలిరోజు 10 నామినేషన్‌లు**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదల కావడంతో రిటర్నింగ్ అధికారి పి సాయిరాం నామినేషన్ల స్వీకరించారు. ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 03.00 గంటల వరకు పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. ఈ ఉపఎన్నికకు తొలిరోజే 10 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో రెండు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు కాగా.. 8 స్వతంత్ర అభ్యర్థులున్నారు.

మిగతా 4లో



### యుద్ధాలను ఆపడంలో
## నేను ఎక్స్‌ఫర్ట్

- తాజాగా ఎనిమిదో యుద్ధం ఆపబోతున్నా
- త్వరలోనే పాక్-అఫ్గాన్ యుద్ధం సంగతి చూస్తా: ట్రంప్

04

### జూబ్లీహిల్స్ పాలిటిక్స్‌లో
# బిగ్ ట్విస్ట్

**తెరపైకి విక్రమ్ గౌడ్**

- చక్రం తిప్పిన డికె అరుణ
- కేంద్ర, రాష్ట్ర నాయకులకు టచ్ లో విక్రమ్ గౌడ్
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో గోషామహల్ ఆశించిన విక్రమ్



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి ఖరారు విషయంలో సంచలన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రం గౌడ్ పేరు ఇపుడు తెరపైకి వచ్చింది. గతంలో హైదరాబాద్ లో చక్రం తిప్పిన ముఖేష్ గౌడ్ చరిష్మా విక్రమ్ కు కలిసి వస్తుందని కమలం పార్టీ లెక్కలు వేస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర పార్టీ నేతలతో విక్రమ్ గౌడ్ టచ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల వరకు విక్రమ్ బీజేపీలోనే ఉన్నారు. తన తండ్రి ప్రాతినిధ్యం వహించిన గోషామహల్ టికెట్ ను ముఖేష్ గౌడ్ ఆశించారు. సిటీ మంత్రిగా ముఖేష్ గౌడ్ కు అన్ని నియోజకవర్గాల్లో అనుచరగణం ఉంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆయన ఏ పార్టీలో లేరు. దీంతో ఆయనను పార్టీలోకి తీసుకువచ్చి టికెట్ ఇవ్వాలన్నది ముఖ్య నేతల ఆలోచనగా తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అభ్యర్థిని ఆదివారం రాత్రే బీజేపీ ఖరారు చేస్తారని అంతా భావించారు. ఇక్కడే రాజకీయం మలుపులు తిరుగుతోంది.

## బీజేపీ బీసీ కార్డు

బీసీ బిల్లుకు బీజేపీని మోకాలడ్డిందని కాంగ్రెస్ గట్టిగా ప్రచారం చేస్తోంది. ఎన్నికల సమయంలోనూ దీనిని వాడే అవకాశముంది. ఈ సమయంలో బీసీకి కాకుండా లంకల దీపక్ రెడ్డికో, కీర్తిరెడ్డికో టికెట్ ఇవ్వడం కలిగే ప్రయోజనం లేకపోగా.. నష్టం జరగవచ్చన్న అభిప్రాయాలు పార్టీ నేతలు కొందరిలో వ్యక్తమయ్యాయి. ఎంపీ ధర్మపురి అర్వింద్ మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్ పేరును ప్రతిపాదించారు. అయితే రామ్మోహన్ కంట ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ అభ్యర్థి అయితే జూబ్లిహిల్స్ లో ప్రభావం చూపడంతో పాటు సిటీలో కాంగ్రెస్ ఓటింగ్ పెరగకుండా గండికొట్టవచ్చని భావిస్తున్నట్లు తెలుస్తోంది. విక్రమ్ గౌడ్ ను బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ గతంలో పార్టీలోకి తీసుకురాగా, ఇపుడు కూడా మరోసారి బీసీ అభ్యర్థిగా బాగుంటాడని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీనికి పార్టీ నేతలు సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంఇ. మరోవైపు బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఢిల్లీలోనే మకాం వేశారు. మంగళవారం లేదా బుధవారం బిజెపి అభ్యర్థిని ఖరారుచేసే అవకాశాలున్నాయి. లేటయినా ప్రభావవంతంగా ప్రచారం షురూ చేయాలని బీజేపీ భావిస్తోంది.



### ఎఎన్ఎన్ ఆధ్వర్యంలో
# ప్రాణదాతలకు పురస్కారాలు

**వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా బ్రోచర్ లాంచ్**

**ఎఎన్ఎన్ ప్రయత్నాన్ని అభినందించిన మంత్రి**


**హైదరాబాద్, మహా:** తెలుగు మీడియా రంగంలో ప్రత్యేక ఒరవడితో దూసుకుపోతున్న ఎఎన్ఎన్ తెలుగు ఛానల్, అమ్మన్యూస్ నెట్ వర్క్ ఆధ్వర్యంలో మెగా డాక్టర్ అవార్డ్స్, బిజినెస్ ఎక్స లెన్స అవార్డ్స్ ను నవంబర్ లో ప్రధానం చేయనుండగా, ఇందుకు సంబంధించిన బ్రోచర్లను తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఎఎన్ఎన్ ప్రయత్నాన్ని అభినందించారు. అవార్డులు ఎలాంటివారికైనా ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. బిజినెస్ లోనూ ప్రత్యేక ఒరవడితో వ్యాపారరంగంలో చెరగని ముద్రవేస్తున్న వారికి , మార్గదర్శులుగా నిలిచేవారిని బిజినెస్ ఎక్సలెన్స అవార్డులతో సత్కరించాలని నిర్ణయించినట్లు ఈ సందర్భంగా ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న డాక్టర్లు, వివిధ విభాగాల స్పెషలిస్ట్ లు, హాస్పిటల్స్, స్ఫూర్తిదాయక వ్యాపార వేత్తల ఎంపికకు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ లకు ఎంట్రీలను ఆహ్వానించినట్లు వివరించారు. వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహ తో పాటు రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ అవార్డుల వేడుకకు హాజరుకానున్నారు. మంత్రి చేతులమీదుగా బ్రోచర్ ఆవిష్కరణ జరగ్గా, కార్యక్రమంలో ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి, బ్యూరో చీఫ్ గడ్డం క్రిష్ణమూర్తి, జీఎం మందడి అరవింద్ రెడ్డి, బిజినెస్, డిజిటల్ హెడ్ రాకేష్ పాల్గొన్నారు.

## సీతక్క-సురేఖలు సమ్మక్క-సారక్కల్లా పనిచేస్తున్నారు

- నాపై ఎవరూ ఫిర్యాదుచేయలేదు.. అలాంటిదేం లేదు
- 90 రోజుల్లో మేడారం పనులు పూర్తిచేస్తాం
- మంత్రి పొంగులేటి



04




### బడుల్లో విద్యార్థుల ఆహార నాణ్యతకు
# స్పెషల్ యాప్

**వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలి**

**రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోండి

హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించడం, వైద్యులు స్టూడెంట్స్‌కు అందుబాటులో ఉండాలి

ప్రతినెలా గ్రీన్ ఛానల్‌లో నిధులు అందించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించండి

వివిధ సంక్షేమ శాఖల సమీక్షలో ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్, మహా:** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ. 60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల

మిగతా 4లో




## మంత్రుల మధ్య విభేదాలు చిన్న విషయమే

**మా కుటుంబ సమస్యలు మేమే పరిష్కరించుకుంటాం**

**ఢిల్లీలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్**

**న్యూఢిల్లీ, మహా :** కాంగ్రెస్ మంత్రుల మధ్య విభేదాలు ఆందోళన చెందాల్సినంత పెద్ద అంశాలు కాదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అది చాలా చిన్న విషయమని చెప్పారు. మంత్రుల మధ్య వివాదాలు అనేవి తమ కుటుంబ సమస్య అని, దానిని తామే పరిష్కరించుకుంటామని తేల్చి చెప్పారు. మంత్రుల మధ్య విభేదాలకు సమాచారలోపమే కారణమన్నారు. వాటిపై దృష్టిసారించామని, అన్ని సమస్యలు అతి త్వరలోనే పరిష్కరిస్తామని

మిగతా 4లో



## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**పూరన్ కుమార్ కుటుంబంతో మాట్లాడిన సీఎం రేవంత్**

**ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చిన భట్టి విక్రమార్క**

04

## రేపు నన్నూ చంపొచ్చు

- తమ్ముడినే చంపాడు.. పదవి కోసం నన్ను కూడా చంపొచ్చు
- మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**జడ్చర్ల, మహా:** మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారంపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఎర్రశేఖర్ ఎమ్మెల్యే పదవి కోసం తనను హత్య చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో తన సొంత తమ్ముడిని సర్పంచ్ పదవి కోసం హత్య చేశారని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. "అలాంటి వ్యక్తి ఎమ్మెల్యే పదవి కోసం నన్ను చంపడానికి కూడా వెనుకాడడు. ఆయన నుంచి రక్షణ కోసం నేను జెడ్ కేటగిరీ భద్రత కోరాలా?" అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు.

**ఫ్యాక్షన్ రాజకీయాలు లేవు..**

ఇప్పటివరకు జడ్చర్లలో ప్రశాంత రాజకీయ వాతావరణం ఉందని, ఫ్యాక్షన్ రాజకీయాలు లేవని ఆయన గుర్తుచేశారు. ఎర్రశేఖర్ కాంగ్రెస్‌లోకి చేరడాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా అంగీకరించరని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. "ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి ప్రయత్నించిన వారిని తిరిగి పార్టీలోకి ఎలా తీసుకుంటారు? అలాంటి వారికి కనీసం గేటు దగ్గర అపాయింట్‌మెంట్ కూడా దొరకదు" అని అన్నారు. కేవలం మీడియాలో ప్రచారం కోసమే ఎర్రశేఖర్ ఇలాంటి లీకులు ఇస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## బడుల్లో విద్యార్థుల ఆహార నాణ్యతకు స్పెషల్ యాప్

(మూడో పేజీ తరువాయి)

మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా, జవాబుదారీతనం ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని, విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని సూచించారు. 'హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలి. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలి. హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలి. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలి.." అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్పులు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, నిర్మాణ ఖర్చులు, ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌ను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఏఐ టెక్నాలజీ ఉపయోగించుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మునుగోడులో స్పెషల్ రూల్స్

- బయటి వారొచ్చి టెండర్లు వేస్తే ఊరుకోం
- ఊరిబయటే షాప్.. రాత్రి 8గంటలకు క్లోజ్
- రాజగోపాల్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

**మునుగోడు, మహా:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరో సారి తెలంగాణలో హాట్ టాపిక్ గా మారారు. ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్న నేపథ్యంలో ఆయన ఆశావహులకు తనదైన శైలిలో వార్నింగ్ ఇచ్చారు. తన నియోజకవర్గంలో వైన్ షాప్ టెండర్లు వేయాలంటే తన రూల్స్ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. టెండర్లు దక్కించుకున్నవాళ్లు ప్రతీ రోజు సాయంత్రం 4 గం.ల నుండి రాత్రి 8 గం.ల వరకు మాత్రమే మద్యం అమ్మాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. మండలానికి చెందిన స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలన్నారు. ఇతర మండలానికి చెందిన వారు టెండర్లు వేస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. వైన్ షాప్ లు ఊరి బయట మాత్రమే పెట్టాల్సి ఉంటుందన్నారు. ఇంకా వైన్ షాప్ కు అనుబంధంగా (సిట్టింగ్) పర్మిట్ రూమ్ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బెల్ట్ షాపులకు మద్యం అమ్మొద్దన్నారు. వైన్స్ దక్కించుకున్న వారు సిండికేట్ అయితే ఊరుకునేది లేదన్నారు. లాటరీ విధానంలో వైన్స్ షాప్ లు దక్కించుకున్న ఓనర్స్ సిండికేట్ కాకూడదు. రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, బెల్టు షాప్ ల నిర్మూలన, మహిళల సాధికారతే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. మునుగోడు నియోజకవర్గంలో ఈ రూల్స్ పాటించే వారు మాత్రమే వైన్స్ షాపులకు టెండర్లు వేయాలన్నారు. రాజగోపాల్ రెడ్డి తాజా వార్నింగ్ తో నియోజకవర్గంలో వైన్స్ షాపులకు టెండర్లు వేయడానికి ఆశావహులు భయపడుతున్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**పూరన్ కుమార్ కుటుంబంతో మాట్లాడిన సీఎం రేవంత్**

**ఐపీఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చిన భట్టి విక్రమార్క**

**చండీఘడ్, మహా:** చండీఘడ్‌లో ఆత్మహత్య చేసుకున్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం పరామర్శించారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్, కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. సీఎం రేవంత్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని.. పూరన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారని ఈ సందర్భండి భట్టి విక్రమార్క తెలిపారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను పరామర్శించిన తర్వాత హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి సూసైడ్ నోట్ ఆధారంగా ఎంత పెద్ద వాళ్ళు ఉన్నా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పూరన్ కుమార్ అత్యంత ప్రతిభావంతుడని. ప్రసిద్ధి గాంచిన ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పట్టభద్రుడని.. ఐఐఎం అహ్మదాబాదులో చదివిన గొప్ప మేధావి అని కొనియాడారు డిప్యూటీ సీఎం. ఉన్నతాధికారుల కుల వివక్ష, వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవడం.. చాలా తీవ్రమైన అంశమన్నారు. పూరన్ కుమార్ సూసైడ్ నోట్ డైయింగ్ డిక్లరేషన్‌గా భావించాలని కోరారు.

## సీతక్క-సురేఖలు సమ్మక్క-సారక్కల్లా పనిచేస్తున్నారు

- నాపై ఎవరూ ఫిర్యాదుచేయలేదు.. అలాంటిదేం లేదు
- 90 రోజుల్లో మేడారం పనులు పూర్తిచేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ములుగు, మహా :** తన మీద సహచర మంత్రులు ఫిర్యాదు చేశారని నమ్మడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తాను అంటే ఏంటో అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. రూ.70 కోట్ల కాంట్రాక్టు కోసం తాపత్రయ పడే అంత అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. మేడారం ఆలయ మాస్టర్ ప్లాన్‌కి అనుగుణంగా రూ.211 కోట్ల నిధులని తమ ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. సోమవారం ములుగులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రులు తన మీద ఫిర్యాదు చేయడానికి అసలు ఏమి ఉందని ప్రశ్నించారు. మంత్రులు సీతక్క , కొండా సురేఖ ఇద్దరూ సమ్మక్క సారక్కలాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. భక్తుల భద్రత, రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. 90 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మేడారం ఆలయ రాతి కట్టడాలకు కావాల్సిన గ్రానైట్‌ని పొరుగు రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు .

## గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తున్నాం

**హైటెక్ సిటీ కట్టి విజన్ పెడితే అందరూ హేళన చేశారు**

**ప్రపంచంలోనే ఎక్కడా లేని రాజధాని కడతాం: సీఎం చంద్రబాబు**

**అమరావతి, మహా:** ఏపీ రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు సోమవారం సీఆర్డీయే కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేకుండా రాష్ట్రం ఏర్పడింది. రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించడానికి నాడు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారు. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారన్నారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టిందని, రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని ఇక్కడ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. బెస్ట్ రాజధాని, గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తున్నామన్నారు. రాజధాని నిర్మాణానికి భూమి కావాలి, ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారన్నారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు నాకు దారి చూపారని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారన్నారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది ఒక్క అమరావతిలోనేనన్నారు. గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించామని, అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారని సీఎం చంద్రబాబు తెలిపారు.

## మంత్రుల మధ్య విభేదాలు చిన్న విషయమే

**మా కుటుంబ సమస్యలు మేమే పరిష్కరించుకుంటాం**

**ఢిల్లీలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్**

(మూడో పేజీ తరువాయి)

చెప్పారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేకు వైద్యులు ఇటీవల పేస్‌మేకర్‌ను అమర్చారు. ఈ నేపథ్యంలో సోమవారం ఖర్గేను మహేష్ కుమార్ గౌడ్.. ఢిల్లీలో కలిసి పరామర్శించారు. ఈ భేటీ అనంతరం ఆయన తెలంగాణలో మంత్రుల మధ్య తలెత్తిన వివాదాలు, విభేదాలపై స్పందించారు. ఆ పరిణామాలను ఖర్గేకు వివరించినట్లు చెప్పారు. అన్ని సమస్యలను అతి త్వరలోనే పరిష్కరిస్తామని కూడా వెల్లడించారు. ఖర్గే ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారన్నారు.

**బీసీ రిజర్వేషన్లపై త్వరలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తాం**

రాష్ట్రంలోని ఇటీవల పరిణామాలపై ఖర్గేకు వివరించడం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో జరిగిన వ్యవహారాన్ని ఖర్గే దృష్టికి తీసుకెళ్లానని, సుప్రీం కోర్ట్ లో అప్పీల్ చేయాలనుకుంటున్న అంశాన్ని కూడా వివరించడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టులో వీలైనంత త్వరలో బీసీ రిజర్వేషన్ల విషయంలో పిటిషన్ ఫైల్ చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఈ విషయంలో సీఎంతో పాటు ఇతర ముఖ్య నేతల జూమ్ సమావేశం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం వేసే పిటిషన్ కు కాంగ్రెస్ పార్టీలోని నాయకులు కూడా ఇన్పీల్డ్ అవుతారన్నారు.

## ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలు పెడితే ఎలా?

- లాటరీలో షాప్ దక్కకపోతే డబ్బులు తిరిగిచ్చేలా ఆదేశించాలి
- తెలంగాణలో కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుం పెట్టారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశాడు. లాటరీలో షాపు దక్కకపోతే రూ.3 లక్షలు అబ్కారీ శాఖకే వెళ్తాయని.. డబ్బును తిరిగిచ్చేలా ఆ శాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశాడు. లిక్కర్ పాలసీపై జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరాడు. దీనిపై ఆబ్కారీశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

## జూబ్లీహిల్స్‌లో పోరు ప్రారంభమైంది

**నిజం, ధర్మం మన వైపు ఉంది.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని, ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నిజం, ధర్మం కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ రెడ్డి గురించి హైదరాబాద్ నగర ప్రజలకు బాగా తెలుసని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని అన్నారు. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తు చేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు సైతం ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కానీ, ఒక్క ముస్లిం ఎమ్మెల్సీ కానీ లేరని ఆయన విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేశారని, ఈసారి కూడా ఆయన టిక్కెట్ ఆశిస్తారని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయనను తప్పించేందుకు కేవలం కాగితంపై 'ఎమ్మెల్సీ' అని రాసి మోసం చేశారని విమర్శించారు. అజారుద్దీన్‌కు ఇచ్చే ఎమ్మెల్సీ నిలబడదని రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. ఈ విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని ఆయన తెలిపారు. షేక్‌పేటలో కబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం కూడా ఆర్మీకి చెందినదని, అది కూడా కోర్టులో నిలబడదని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పారని, అది కూడా కోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసినా ప్రజలను మోసం చేయడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను, మైనార్టీలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు గట్టిగా బుద్ధి చెబితే, ఢిల్లీలోని అధిష్ఠానం సైతం ఉలిక్కిపడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొందని అన్నారు. దుర్గాదేవిలాగా, కాళికాదేవిలాగా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని ఇప్పుడు ప్రతి మహిళ అంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయించిందని ఆయన ఆరోపించారు. ఒక ఇంట్లో అయితే ఏకంగా 43 దొంగ ఓట్లు నమోదు చేయించారని అన్నారు. కాంగ్రెస్ ఒక్కో వర్గానికి చాలా బాకీ పడిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పెన్షన్ పెంపు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇలా అన్నీ కాంగ్రెస్ బాకీలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

## కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఎన్నికలలో కాంగ్రెస్ హస్తం గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ పార్టీ నుంచి పోటీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరు ప్రకటించిన తర్వాత ,అభ్యర్థి నేరుగా మజ్లిస్ అధినేత దగ్గరికి వెళ్లి కలిసినట్లు రాంచందర్ రావు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు గత ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన తర్వాత పొలిటికల్ ఈక్వేషన్స్ పూర్తిగా మారిపోయాయన్నారు. అప్పటి వరకు బీఆర్ఎస్ తో చెట్టాపట్టాల్ వేసుకుని మిత్రపక్షంగా ఉన్న మజ్లిస్, కాంగ్రెస్ పార్టీకి మిత్రపక్షంగా మారిపోయిందన్నారు. పాతబస్తీలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ తో స్నేహహస్తం చాచినట్లు మజ్లిస్ అధినేత వివరణ ఇచ్చుకున్నారన్నారు. సుల్తాన్ సల్లావుద్దీన్ ఓవైసీ పార్టీ అధినేతగా ఉన్న సమయం నుంచి కాంగ్రెస్ తో మజ్లిస్ కు మంచి సంబంధాలు కొనసాగాయని గుర్తు చేశారు.



## యుద్ధాలను ఆపడంలో నేను ఎక్స్‌ఫర్ట్

- తాజాగా ఎనిమిదో యుద్ధం ఆపబోతున్నా
- త్వరలోనే పాక్-అఫ్గాన్ యుద్ధం సంగతి చూస్తా: ట్రంప్

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** ప్రపంచంలో ఏమూల సైనిక ఘర్షణ జరిగినా ట్రంప్ అప్రమత్తమైపోతున్నారు. ఏడు యుద్ధాలను ఆపినట్లు వెల్లడించిన ఆయన తాజాగా ఎనిమిదో యుద్ధం ఆపబోతున్నట్లు వెల్లడించారు. గాజా ఒప్పందం కోసం పశ్చిమాసియాకు పయనమైన వేళ ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ''నేను ఆపిన ఎనిమిదో యుద్ధం (గాజాలో) అవుతుంది. పాకిస్థాన్‌అఫ్గానిస్థాన్‌ల మధ్య కూడా యుద్ధం జరుగుతోందని విన్నాను. నేను తిరిగి వచ్చేవరకు ఆగుతాను. నేను యుద్ధాలను ఆపడంలో నిపుణుడిని'' అని ట్రంప్ పేర్కొన్నారు. టారిఫ్‌లను ఆయుధంగా వాడి తాను సంక్షోభాలను పరిష్కరించానని పునరుద్ఘాటించారు. దీనికి భారత్‌పాక్ సైనిక ఘర్షణను ఆయన ఉదాహరణగా చూపారు. ఇరుదేశాలపై 100 నుంచి 150, 200శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించడంతో 24 గంటల్లో యుద్ధం ఆగిపోయిందన్నారు. టారిఫ్‌లు లేకపోతే తాను ఎప్పటికీ సమస్యను పరిష్కరించలేకపోయేవాడినని వెల్లడించారు. ఉక్రెయిన్‌రష్యా యుద్ధ పరిష్కారానికి కఠిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. మాస్కో రాజీకి రాకపోతే.. తాను కీవ్‌కు తోమహాక్ క్షిపణులను అందజేస్తానని హెచ్చరించారు. అది పుతిన్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుందని ఆయన వివరించారు.

## మీ సేవలో షెడ్యూల్ కులాల వర్గీకరణ అమలు

**కొత్తగా ఉపవర్గీకరించిన గ్రూపులతో అప్‌డేట్ చేశాం**

**పౌరులు తమ వర్గానికి సరిపడే ధ్రువపత్రాలను పొందగలరు**

**సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో కొత్త షెడ్యూల్ కులాల వర్గీకరణ విధానాన్ని 'మీ సేవ' కేంద్రాల ద్వారా విజయవంతంగా అమలు చేసినట్లు సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సోమవారం వెల్లడించారు. ఈ కొత్త విధానంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల మంది పౌరులు లాభపడనున్నారని ఆయన తెలిపారు. "రాష్ట్రంలోని అన్ని మీ సేవ కేంద్రాలను కొత్తగా ఉపవర్గీకరించిన షెడ్యూల్ కుల గ్రూపులతో అప్‌డేట్ చేశాం. ఇకపై పౌరులు తమ వర్గానికి సరిపడే ధ్రువపత్రాలను సులభంగా పొందగలరు," అని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణ చట్టం నంబర్ 15-2025 మరియు జీ.ఓ.ఎంఎస్. నంబర్ 9 (షెడ్యూల్ కులాల శాఖ, తేదీ 14-04-2025) ప్రకారం ఈ వర్గీకరణ వ్యవస్థను మీ సేవలో అమలు చేసినట్లు ఆయన తెలిపారు. "రిజర్వేషన్లను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయడంలో ఈ చర్య కీలకమైన ముందడుగు," అని ఆయన అన్నారు. ఈ మార్పులతో ప్రతి సంవత్సరం మీ సేవ ద్వారా షెడ్యూల్ కుల ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసే నాలుగు లక్షల మంది పౌరులు ప్రయోజనం పొందనున్నారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. అంతేకాకుండా, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బీసీ కుల ధ్రువపత్రాల పునర్ముద్రణ (రీఇష్యూ) సదుపాయాన్ని కూడా ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. "పునర్ముద్రిత ధ్రువపత్రంలో ఆమోదించిన అధికారి, పునర్ముద్రణ తేదీ వివరాలు స్పష్టంగా ఉంటాయి. ఇది ప్రజలకు మరింత సౌలభ్యం కలిగించే డిజిటల్ చర్య," అని ఆయన వివరించారు. ప్రజా సేవల డిజిటల్ రూపాంతరంపై దృష్టి సారిస్తూ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "మీ సేవను ప్రతి పౌరుడికి వేగవంతమైన, న్యాయమైన, ఖచ్చితమైన సేవలు అందించే వేదికగా మేము తీర్చిదిద్దుతున్నాం. ఈ చర్యలు తెలంగాణ ప్రభుత్వం సమానత్వం, సాంకేతిక సాధికారత పట్ల చూపిస్తున్న నిబద్ధతను ప్రతిబింబిస్తాయి," అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీ సేవ కేంద్రాలు, అధికారిక మీ సేవ వెబ్‌సైట్ ద్వారా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మూడో పేజీ తరువాయి)

తెలంగాణా పునర్ నిర్మాణ సమితి తరుపున పూస శ్రీనివాస్, నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు, స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్ ఖాన్ లు నామినేషన్ లు దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలకు కొద్ది గంటల ముందు షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ సందర్శించారు. సన్నద్ధతను ఆర్ఓ ,ఏఆర్ఓలతో సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఈసీఐ నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నామినేషన్ ల స్వీకరణకు సర్వ సన్నద్ధం గా ఉండాలని రిటర్నింగ్ అధికారి పి సాయిరాంకు సూచించారు.

## భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**తెలంగాణ క్రీడాకారిణి జీవాంజి దీప్తికి సీఎం అభినందనలు**



**హైదరాబాద్, మహా:** ఆస్ట్రేలియాలో జరుగుతున్న వర్టూస్ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో మహిళల విభాగం 400 మీటర్ల(టీ20) పరుగు పందెంలో సత్తా చాటి స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి జీవాంజి దీప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఆస్ట్రేలియా బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మకమైన వర్టూస్ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రికార్డు సమయంలో 55.92 సెకన్లలో లక్ష్యం చేరుకుని స్వర్ణం సాధించిన దీప్తి మరోసారి అంతర్జాతీయ వేదికపై తెలంగాణ కీర్తిని చాటారని ప్రశంసించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి యువతకు ఎంతో స్ఫూర్తిగా నిలుస్తున్నారని, ఆమె భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు

**సంక్షేమ వసతి గృహాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు , తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీ లో ముఖ్యమంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా జవాబుదారీతనం ఉండాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఆదేశించారు. హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.

# మందమర్రిలో అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా

## ఆన్లైన్ గోదావరి ఇసుకకు 3300... మందమర్రి వాగు ఇసుకకు 3500

### తాసిల్దార్ సతీష్ కుమార్ కొంచెం దేకో సార్

**మందమర్రి, మహా :** మందమర్రి లో అందరూ హరి చంద్రులే... కానీ రొయ్యల ముల్లెలు మాత్రం మాయం అవుతున్నాయి అనే చందంగా ప్రభుత్వ అధికారుల వ్యవహారం ఉంది. ప్రభుత్వ నిర్మాణాలకు మాత్రమే స్థానిక ఇసుకను వాడాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని స్థానిక ట్రాక్టర్ యజమానులు, కాంట్రాక్టర్లు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. మంచిర్యాల గోదావరి ఇసుక మందమర్రి కి రావాలంటే ఒక ట్రాక్టర్ కు 3300 రూపాయలు ఆన్లైన్ చాలన్ కడితే 24 గంటల్లో వస్తుంది. కానీ మందమర్రి మండలంలో వివిధ సొంత నిర్మాణాల కు ప్రజలు వాడాలంటే ట్రాక్టర్ యజమానులు 3500 రూపాయలు ముక్కు పిండి మరీ వసూలు చేస్తుండగా ఆ ఇసుక ట్రిప్పు ఎప్పుడు వస్తుందో తెలియ రావడం లేదు.



మందమర్రి తాసిల్దార్ సతీష్ కుమార్ వివరణ

**విచ్చలవిడిగా అక్రమ ఇసుక**

మందమర్రి మండలంలో అక్రమ ఇసుక దందా విచ్చలవిడిగా కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బొక్కలగుట్ట, పులిమడుగు, కోటేశ్వరరావు పల్లె, అందుగుల పేట, ఊరు మందమర్రి, సారంగపల్లి, శంకర్ పల్లి తదితర గ్రామాల నుంచి ట్రాక్టర్లు నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంతమంది గ్రామవాసులు ఇసుక ట్రాక్టర్ నింపితే ఒక ట్రిప్పుకు 1000 నుండి 1500 రూపాయలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**నిద్ర మత్తులో సంబంధిత అధికారులు**

ఒకపక్క మందమర్రి మండలంలో విచ్చలవిడిగా అక్రమ రవాణా జరుగుతున్న సంబంధిత రెవెన్యూ, అటవీ అధికారులకు తెలిసిన పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. ఒక సంవత్సరం క్రితం మండలంలో అటవీ అధికారులు అక్రమ ఇసుకపై ఉక్కు పాదం మోపి పలు ట్రాక్టర్ల పై భారీ మొత్తంలో అపరాధ రుసుము వేసి ట్రాక్టర్ ఓనర్లకు గుబులు పుట్టించిన విషయం విధితమే. అయితే ప్రస్తుతం ఇక్కడ ఆ అధికారుల జాడ కాన రాకపోవడం గమనార్హం. రెవెన్యూ, అటవీ, మైనింగ్ శాఖ అధికారులు నామమాత్రపు పర్యవేక్షణ చేయకపోవడం పై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఒక ట్రాక్టర్ కు 500 రూపాయలు.!?**

మందమర్రి లోకల్ వాగులలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానుల వద్ద యాపల్ ప్రాంతానికి చెందిన పాత్రికేయుడు ఒక ట్రాక్టర్ కు నెలకు 500 రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. సదరు పాత్రికేయుడు ఎవరైనా మీ ట్రాక్టర్ ను ఆపితే నాకు ఫోన్ చేయండి నేను వారితో కానీ ఇతర సంబంధిత అధికారులతో కానీ మాట్లాడుతానని ట్రాక్టర్ యజమానులకు అభయం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనితో గత నాలుగు సంవత్సరాలుగా మండలంలో ఆ పాత్రికేయుడు దాదాపు నెలకు 15వేల రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారమే కాకుండా మిగతా అక్రమ వ్యవహారాలలో కూడా ఇతగాడి పాత్ర ఆడింది ఆటగా పాడింది పాటగా కొనసాగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

మందమర్రి మండలంలో ఇసుక అక్రమ రవాణా గురించి స్థానిక తాసిల్దార్ సతీష్ కుమార్ ను వివరణ కోరగా ఒక పొన్నారం గ్రామంలో మాత్రమే ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నాయని వెల్లడించారు. తాను మండలంలో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు 5 లక్షల రూపాయల మేరకు అక్రమ ఇసుక ట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వానికి అపరాధ రుసుములు కట్టించినట్లు తెలిపారు. అందుగుల పేట, బొక్కలగుట్ట, ఊరు మందమర్రి, శంకర్ పల్లి తదితర పరిసర వాగుల నుండి అక్రమంగా ఇసుక తరలింపులు జరిగితే తమకు సమాచారం ఇస్తే పట్టుకుంటామని ఆయన చెప్పారు. అలా కాని పక్షంలో గ్రామస్తులు కానీ బాధ్యత గల పౌరులు కానీ అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. అక్రమ ఇసుక రవాణా నివారణకు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన స్పష్టం చేశారు.

### ఘనంగా దివంగత నేత కామ్రేడ్ గుండా మల్లేష్

# 5వ వర్ధంతి వేడుకలు

## నివాళులర్పించిన భారత కమ్యూనిస్టు పార్టీ బెల్లంపల్లి పట్టణ సమితి



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన సిపిఐ దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుండా మల్లేష్ గారి 5 వ వర్ధంతి వేడుకలను సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి కామ్రేడ్ గుండా మల్లేష్ సామాన్య రైతు కుటుంబంలో పుట్టి భారత కమ్యూనిస్టు పార్టీలో అంచలం చెలుగా ఎదిగి నాలుగుసార్లు బెల్లంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలకు చిరస్థాయిలో గుర్తుండిపోయే విధంగా సేవలను అందించడం జరిగిందని గుర్తుచేసుకున్నారు. బెల్లంపల్లి పట్టణ కార్యాలయంలో వర్ధంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ మంచిర్యాల జిల్ల కార్యదర్శి కామ్రేడ్ రామడుగు లక్ష్మణ్ దివంగత నేత గుండా మల్లేష్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 5వ వర్ధంతి జిల్లా వ్యాప్తంగా అన్ని పార్టీ కార్యాలయాల్లో జరుగుతున్నాయని గుండా మల్లేష్ నాటి నుండి తుదిశ్వాస వరకు బడుగు బలహీన పేద వర్గాల ప్రజల కోసం అలుపెరుగని పోరాటం చేశారని గుండా మల్లేష్ మన మధ్యలో లేకపోవడం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి తీరనిలోటుగా ఏర్పడుతున్న దన్నారు. 1983, 1985 1994 మరియు కొత్తగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గంలో ఒకసారి మొత్తంగా నాలుగు సార్లు ఎమ్మెల్యే గెలిచిన గుండా మల్లేష్ భూమిలేని పేదలకు భూ పంపిణీ తో పాటు ఇల్లు లేని వారికి ఇండ్లు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ప్రస్తుత రోజుల్లో సర్పంచ్ గా కౌన్సిలర్ గా గెలిచిన వాళ్లే కోట్లకు పరిగెత్తుతుంటే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గుండా మల్లేష్ ఎలాంటి అవినీతికి తావు లేకుండా నిస్వార్థంగా ప్రజా శ్రేయస్సుకు పాటుపడినటువంటి మహనీయుడని ఆయనను ఆదర్శంగా తీసుకొని పార్టీ శ్రేణులు కూడా నిస్వార్థంగా ప్రజా ప్రయోజనాలపై పాటుపడాలని సూచించారు. ఎఐటియుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకట్ స్వామి మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా శ్రీకృష్ణ కమిటీ, మన్మోహన్ సింగ్, సోనియాగాంధీ ఎదుట నా తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను సిపిఐ పార్టీ శాసనసభ పక్ష నేతగా తెలంగాణ వాదాన్ని వినిపించి ఆనాడు రాష్ట్ర సాధనలో శక్తివంచనకు తావులేకుండా పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందని, భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజాసంఘాల నిర్మాణంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎనలేని సేవలందించినటువంటి గుండా మల్లేష్ నేడు మనమధ్యలో లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎక్కడ బూటకపు ఎన్కౌంటర్లు జరిగి నా అమరుల పార్థివ దేహాలను వారి యొక్క కుటుంబాలకు అప్పగించి అంతిమయాత్రలు పూర్తి అయ్యే వరకు అక్కడే ఉండేవారని, కార్మికుల కోసం కర్షకుల కోసం సంఘటిత, అసం ఘటిత రంగ కార్మికుల కోసం రాజీలేని పోరాటాలు చేశారని, తెలంగాణ రైతంగ సాయుధ పోరాట అమరవీరుల ఆశ యసాధనలో ఎనలేని సేవ చేశారని వారన్నారు. సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు చిప్పనరసయ్య, కామెర మల్లయ్య మాజీ ఎంపీపీ, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు గుండా సరోజ, జిల్లా అధ్యక్షులు బొల్లం సోని, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బికెఎంయు జిల్లాకార్యదర్శి గుండా చంద్ర మాణిక్యం, డి హెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షులు డిఆర్ శ్రీధర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రత్నం రాజం, అంకుశం సీనియర్ నాయకుడు మూల శంకర్ గౌడ్, బెల్లంపల్లి పట్టణ కౌన్సిల్ సభ్యులు బండారి శంకర్, శనిగారపు రాజేందర్, స్వామిదాస్, రత్నం ఐలయ్య, ప్రభుదాస్, గుండ ప్రశాంత్ గుండా శంకర్ ,గోలేటి రాయలింగు, కే తిరుపతి, బియ్యాల పద్మ, బూర్ల సమ్మయ్య, లక్ష్మి కిరణ్ పాల్గొన్నారు.



### తూతూ మంత్రంగా

# ప్రజావాణి

- మందమర్రి మండలలో ఖాళీ కుర్చీల దర్శనం
- ఉదయం 11.30 నిమిషాలైన ప్రారంభం కాని వైనం

**మందమర్రి, మహా :** మందమర్రి మండల కేంద్రంలో తూ తూ మంత్రంగా ప్రజావాణి కార్యక్రమం అమలవుతోంది. ప్రతి సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి మండల అభివృద్ధి కార్యాలయాల వరకు ప్రజల ఆర్జీలు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదులు (ప్రజావాణి) విభాగాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఇక్కడ నిర్వహణ అధికారులు ఆ మాటలు విడిచేవిన పెట్టినట్లు అర్థమవుతుంది. సోమవారం మందమర్రి మండల అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం ఉదయం 11:30 అయినా ప్రారంభం కాకపోవడం గమనార్హం. సదర్ కార్యాలయానికి మహా దిన పత్రిక ప్రతినిధి వెళ్లగా ఖాళీ కుర్చీలతో దర్శనం ఇచ్చింది. ఈ సమావేశానికి 21 మంది వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు రావాల్సి ఉండగా కేవలం 8 మంది మాత్రమే హాజరు కావడం పట్ల పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మందమర్రిలో ఇచ్చిన పలు ఆర్జీదారుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మండల ప్రజలు ఫిర్యాదులు చేయడం లేదని సమాచారం. ఈ విషయంపై జిల్లా సంబంధిత ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడుతారో వేచి చూడాల్సిందే.



### ఉచిత సామూహిక వివాహ మహోత్సవానికి

## 4 క్వింటాళ్ల బియ్యం

# అందజేత

### తిలక్ వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులకు అందించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


**బెల్లంపల్లి, మహా:** తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నిర్వహిస్తున్న సామూహిక వివాహ మహోత్సవానికి మాజీఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య 4 క్వింటాళ్ల బియ్యం ను సోమవారం నాడు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెల్లం పల్లి పట్టణంలో అనేక సేవాకార్య క్రమాలు నిర్వహిస్తున్న తిలక్ వాకర్స్అసోసియేషన్ సభ్యులు ఉచిత సామూహిక వివాహ మహోత్సవం కూడా నిర్వహించడం చాలా ప్రశంసనీయమని, పట్టణంలో పలు సందర్భాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అసోసియేషన్కు ఎల్లప్పుడు తమ పార్టీ తోపాటు వ్యక్తిగతంగా అండగా నిలుస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తిలక్ వాకర్స్అసోసియేషన్ సభ్యులు రంగ రామన్న, కంటెవాడ నాగేష్, రత్నం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు సంఘటన్ శ్రుజన్ అభియాన్ కార్యక్రమం

## ఏఐసీసీ పరిశీలకుల సమావేశం

### సాయంత్రం 530కు గాయత్రి గార్డెన్ వేదికగా శ్రేణులు హాజరు కావాలని ఓ ప్రకటనలో కోరిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** డీసీసీ ల నియామక ప్రక్రియలో భాగంగా నేడు మంగళవారం సాయంత్రం 530 గంటలకు పట్టణంలోని గాయత్రి గార్డెన్ లో ఏఐసీసీ పరిశీలకులచే సమావేశం ఉంటుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మీటింగ్ కు కర్నాటక మాజీ ముఖ్యమంత్రి తనయుడు, ప్రస్తుత కర్ణాటక రాష్ట్ర జేవర్గి నియోజక వర్గ ఎమ్మెల్యే, కళ్యాణ్ కర్ణాటక రీజియన్ డెవలప్మెంట్ బోర్డు అధ్యక్షుడు, మూడు సార్లు కర్ణాటక శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన ఏఐసీసీ పరిశీలకులు అజయ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఆదిలాబాద్ నియోజక వర్గంతో పాటు గాదిగూడ, సిరికొండ, నార్నూర్, ఉట్నూర్ , ఇంద్రవెల్లి మండలాల సమీక్ష కూడా ఉంటుందన్నారు. కావున ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గంతో పాటు ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.



# దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు హోమియోపతి వైద్యం ఉత్తమం

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు హోమియోపతి వైద్యం మెరుగైనదని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ ఆయుష్ పథకం క్రింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హోమియోపతి వైద్య శిబిరంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, వైద్య శిబిరం ఇంచార్జ్ డాక్టర్ స్పందనలతో కలిసి ఆయన ఆయన ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ వైద్య విధానం ఎన్నో దేశాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రణలో హోమియోపతి మెరుగైనదని తెలిపారు. ఆయుర్వేదం, యునాని, అల్లోపతి లాంటి అనేక ప్రత్యామ్నాయ వైద్య విధానాల ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో హోమియోపతి మెరుగైన ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా జాతీయ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. హోమియోపతి వైద్యం తక్కువ ఖర్చుతో కూడుకుందని, మందుల వినియోగం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. మీడియా ద్వారా ప్రజలందరికీ అవగాహన కల్పించి శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కు

## నూతన కార్యవర్గం

# నియామకం

**బెల్లంపల్లి, మహా:** తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని హైదరాబాద్ కోఠీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం నాడు టి.సి.ఏ. రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎండల లక్ష్మీనారాయణ నేతృత్వంలో ఎన్నుకున్నట్లు మంచిర్యాల జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పైడిమల్ల నర్సింగ్ తెలిపారు నూతన టిసిఏ రాష్ట్ర అధ్యక్షులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు బి.బి. పాటిల్, ప్రధాన కార్యదర్శిగా ధరం గురువారెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ప్రేమ్ చందర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా నుండి తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్, కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి మదే రాజేష్, కోఆర్డినేటర్ జాడి శేఖర్, కోచ్ అల్లం గౌతమ్ పాల్గొని ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు ప్రకటించారు.

# టేకు చెట్టు నరికిన వ్యక్తి అరెస్టు

## న్యాయస్థానంలో హాజరు... నిందితుడికి 12 రోజుల రిమాండ్

**లక్షెట్టిపేట /మంచిర్యాల, మహా :** తాని మడుగు బీట్ లో టేకు చెట్టు నరికిన పెందుర్ రాజేష్ అనే వ్యక్తిని ఆదివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తాళ్ళ పేట ఎఫ్ ఆర్ ఓ సుష్మ తెలిపారు. తాని మడుగు బీట్ పరిధిలో టేకు చెట్లు నరికారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తాళ్ల పేట రేంజ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందంతో కలిసి తని మడుగు బీట్ లోని 394 వ కంపార్ట్మెంట్ లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అక్కడ చెట్లు నరికినట్లు గుర్తించామని ఆమె వెల్లడించారు. అక్కడ నరికిన టేకు చెట్ల వద్ద లభించిన ఆధారాలను డాగ్ హంటర్కు వాసన చూపించగా, అది సుమారు 4 కిలోమీటర్ల దూరం వరకు ట్రాక్ చేస్తూ తానిమడుగు గ్రామంలోని పెందుర్ రాజేష్ అనే వ్యక్తి ఇంటివరకు తీసుకు వెళ్లిందని వెల్లడించారు. ఆ ఇంట్లో తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా అక్కడ కలప లభించిందని స్పష్టం చేశారు. దానితో రాజేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతను తన నేరాన్ని అంగీకరించాడని తెలిపారు. దానితో అతనిపై కేసు నమోదు చేసి లక్షెట్టిపేట న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. కాగా న్యాయమూర్తి నిందితునికి 12 రోజుల రిమాండ్ విధించినట్లు ఆమె వెల్లడించారు.



# దొంగలను పట్టించిన యువకుడు

**ఆదిలాబాద్ మహా :** ఇటు ఒక్కడు...అటు ముగ్గురు ...దొంగలను పట్టుకునేందుకు 120 కిలోమీటర్ల వేగంతో బైక్ చేజింగ్ లు.. ఒంటి చేత్తో డ్రైవింగ్ .. మరో చేతితో సెల్ ఫోన్ లో దొంగల వీడియో షూటింగ్ ..నేషనల్ హైవేపై రయ్ రయ్ మని ఒక బైక్ వెనుకాలే మరో బైక్...ఇదేదో సినిమానో సీరియల్లో షూటింగ్ కాదు , సామాజిక మాధ్యమాల్లో దుమ్మురేపేలా చేసే రీల్ చిత్రీకరణ అంతకంటే కాదు. ఇది ఓ సాధారణ మధ్యతరగతి ప్రైవేట్ గుమాస్తా చూపిన తెగువ. ఒక్కసారిగా తన చేతిలో నుండి కాజేసిన 4లక్షల రూపాయలు గల క్యాష్ బ్యాగ్ తిరిగి దక్కించుకునేందుకు చేసిన పోరాటం. సీన్ కట్ చేస్తే .. ఈ నెల 7న ఆదిలాబాద్ కు చెందిన వికాస్ మోజె అనే ఓ ప్రైవేట్ గుమస్తా తన యజమాని ఆదేశం మేరకు ఇచ్చోడ పట్టణానికి వెళ్లి అక్కడ నుండి దాదాపు 4 లక్షల 15 వేల రూపాయలను బ్యాగ్ లో పెట్టి తిరిగి అదిలాబాద్ కు పయనమయ్యాడు. ఇదంతా గమనించిన ముగ్గురు చోరులు అతడిని వెంబడించి ఆదిలాబాద్ శివారులో గల దేవాపూర్ చెక్ పోస్ట్ దాటిన వెంటనే రెప్పపాటులో అతనిపై దాడి చేసి క్యాష్ బ్యాగ్ తో ఉడాయించారు. ఊహించని హఠాత్పరిణామం నుండి వెంటనే తేరుకున్న వికాస్ తన బైక్ పై వారిని వెంబడించాడు. హైస్పీడ్ తో దూసుకెళ్తున్న దొంగల బైక్ ను దాదాపు 120 కిమీ వేగంతో చేజ్ చేసాడు. అంత వేగంలోనూ ఒక చేతితో బైక్ హ్యాండిల్ చేస్తూ మరో చేతితో మొబైల్ లో దొంగల వీడియో చిత్రీకరించాడు. సులువుగా తప్పించుకుంటామని భావించిన దొంగలకు వికాస్ కొరకరాని కొయ్యలా తయారయ్యాడు.



దీంతో అతడిని బైక్ నుండి కింద పడిపోయేలా ప్రయత్నించారు దొంగలు. కాని ఆ సాహసి ముందు వారి పప్పులుడక లేదు. ఇక వీడు వదిలేలా లేడని భావించిన చోరులు చివరికి అతని బారినుండి తప్పించుకునేందుకు రోడ్డు దిగి బైక్ ను ఓ వ్యవసాయ క్షేత్రం లోకి తోలారు. ముందుకు వెళ్లేందుకు కంచె అడ్డు రావడంతో అక్కడే బైక్ వదిలేసి కాళ్లకు పని చెప్పి పలాయనం చిత్తగించారు. డయల్ హండ్రెడ్ తో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులకు ఆ యువకుడు జరిగినదంతా పూస గుచ్చినట్టు చెప్పి బైక్ పై దొంగలు పారిపోతున్న వీడియోలు అందచేసాడు. ఇంకేముంది 24గంటల్లోనే బైక్ నెంబర్ ఆధారంగా విచారణ జరిపి ముగ్గురు నిందితులను పట్టుకుని వారి వద్ద నుండి 45 వేల రూపాయలు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు . బాధితుడు తన ప్రాణాలకు తెగించి మరీ సెల్ ఫోన్ లో నిందితుల ముఖచిత్రాలు కనబడేలా వీడియో తీసి ఆధారాలను సేకరించి పోలీసులకు అందజేయడంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి మావల సీఐ కర్ర స్వామి తో కలిసి వికాస్ మోజేను శాలువాతో సత్కరించి అతని ధైర్య సాహసాలను మెచ్చుకున్నారు. అతి వేగం ప్రమాదకరమని తెలిసినా తన చేతినుండి దొంగిలించబడిన యజమాని సొమ్మును తిరిగి దక్కించుకునేందుకు ఓ మిడిల్ క్లాస్ ప్రైవేట్ ఉద్యోగి హీరోలా చూపిన తెగువ, ధైర్యం చేసి శభాష్ అని యువకుడిని ప్రశంసిస్తున్నారు.


# అగ్రవర్ణాల కుట్రలు ఇకనైన మానుకోవాలి

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

**మందమర్రి, మహా :** అగ్రవర్ణాల కుట్రలు ఇకనైన మానుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిళ్ళ శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షులు ముడారపు శేఖర్ లు హెచ్చరించారు. సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మందమర్రి అంబేద్కర్ స్తూపం ముందర రహదారిపై బైఠాయించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదక కులాలుగా ఉన్న బీసీలను ఎన్నో ఏళ్లుగా అణిచివేస్తూ, బీసీల హక్కులను కాలరాస్తున్న అగ్రవర్ణాల కుట్రలు ఇకనైన మానుకుని హితవుపలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా విద్య, ఉద్యోగ, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించినపుడే బీసీ రాజ్యాధికారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బీసీ హక్కుల కోసం ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.



ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు తడిగొప్పుల రవిరాజా, మడ్డి వేణుగోపాల్ గౌడ్, మహారాజుల సంపత్, ఎండి కలీం, ఎం శంకర్, జమల్పూరి సత్యనారాయణ, యోగానంద రావు, అరకటి రవీందర్, ముష్కే అఖిల్, శ్రావణ్ కుమార్, చీర్ల రాజు, ఎండి వసీం, పున్నం రాజు, ఓమేశ్వర్, కళ్యాణ్, నవీన్, నెల్లి వీరయ్య, బల్ల శంకర్, రమేష్, దయ్యాల సదయ్య, జక్కుల రాజం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఏఐసీసీ పరిశీలకులను కలిసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం నిర్మల్ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏఐసీసీ పరిశీలకులు కర్నాటక మాజీ ముఖ్యమంత్రి తనయుడు ప్రస్తుత కర్ణాటక రాష్ట్ర జేవర్గి నియోజక వర్గ ఎమ్మెల్యే, కళ్యాణ్ కర్ణాటక రీజియన్ డెవలప్మెంట్ బోర్డు అధ్యక్షుడు మూడు సార్లు కర్ణాటక శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన అజయ్ సింగ్ ను ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ లో మర్యాద పూర్వకంగా కలిసారు. శాలువాతో సత్కరించి ఆదిలాబాద్ నియోజక వర్గం గురించి వివరించారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు.

# ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు 'కల్లాల' నిర్మాణం


**బెల్లంపల్లి, మహా:** ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నలకు 'తేమశాతం' నిబంధనలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వరి ఆరబెట్టే యంత్రాలు సైతం తక్కువగా ఉండడంతో రోజుల తరబడి వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతల ఇబ్బందులను దూరం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ నిధులతో రైతులు తమ ఇండ్లు, పొలాల వద్ద ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించింది. నాలుగేళ్ల క్రితమే కేంద్రం ఈ అవకాశమిచ్చినా రైతులు ముందుకు రాలేదు. అయితే ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ప్రభుత్వం సూచించడంతో ఇండ్లు, పొలాల వద్ద కల్లాల నిర్మాణానికి ముందుకు వస్తున్నారు.

**..ఆరబెట్టుకునేందుకు అష్టకష్టాలు..**

రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రహదారులు, ఇంటి ముందు ఖాళీగా ఉన్న ఇరుకు స్థలాల్లో ధాన్యం రాశులు పోస్తూ ఆరబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆరబెడుతున్న క్రమంలోకోతులు, వర్షాల వల్ల నష్టం వాటిల్లడం సహజంగా మారింది. రోడ్లపై ధాన్యం నిల్వ చేస్తుండటంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగిన ప్రాణాలు పోయిన ఘటనలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ ద్వారా ధాన్యం ఆరబెట్టుకునే కల్లాల నిర్మాణానికి కేంద్రం అవకాశం కల్పిస్తుండడంతో రైతన్నలు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తున్నారు. ..మూడు రకాల కల్లాలు.. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు పొందిన సన్న, చిన్న కారు రైతులు మూడు రకాల కల్లాలు నిర్మించుకునే అవకాశం ఉంది. 50 చదరపు మీటర్ల లోపు చేస్తే రూ. 56 వేలు, 60 చదరపు మీటర్ల లోపు చేస్తే రూ. 68 వేలు, 75 చదర పు మీటర్ల లోపు చేస్తే రూ. 85 వేలు అందజేస్తారు. గతంలో ఇళ్లు, పొలాల వద్ద నిర్మించుకోవాలని ప్రతిపాదనలు తీసుకొచ్చారు. అయితే దీనికి ఒక గుంట వరకు స్థలం అవసరమవుతుండడంతో గతంలో రైతులు మీదుకు రాలేదు. కానీ ఈ సారి కల్లాలు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపడం శుభ పరిణామం.



# ఇద్దరిపై చర్యలు తీసుకోవాలి



**మంచిర్యాల, మహా :** మందమర్రి మునిసిపాలిటీ కార్యాలయం ఆవరలో ఉన్న మీ (ఈ) సేవ కేంద్రం మేనేజర్ ఉపేందర్, ఇంచార్జి జనార్ధన్ లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మందమర్రి పట్టణ అఖిలపక్ష నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పౌర సేవలకు మీ (ఈ) సేవలకు వస్తున్న విద్యార్థులను, యువకులను, వృద్ధులను, అవహేళన చేస్తూ, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారన్నారు. ప్రజలకు తెలియని విషయాలు సలహా సూచనలు ఇవ్వకపోక వారినీ బెదిరిస్తూ , సమయపాలన పాటించకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెల్లడించారు. తక్షణమే వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకారం రమేష్, బండి శంకర్,సతీష్, కత్తి రమేష్, సొత్కు ఉదయ్, సిపెల్లి సాగర్, రాయబారపు కిరణ్, చిప్పకుర్తి శశిధర్, మహేష్ పాల్గొన్నారు.

# దొంగలకు సువర్ణ అవకాశం

- దొంగిలించిన వస్తువు తెల్లారే సరికి ఉండాలి
- మామిడి గట్టు పంచాయతీలో డప్పు చాటింపు



**మందమర్రి, మహా :** మంచిర్యాల జిల్లా, మందమర్రి మండలం, మామిడి గట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి దొంగలకు సువర్ణ అవకాశం కల్పిస్తూ ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.... మందమర్రి మండలం మామిడి గట్టు గ్రామపంచాయతీ పారిశుద్ధ ట్రాక్టర్ హైడ్రాలిక్ పెడల్ (పట్టి) ని రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇదే కాకుండా ఈ ప్రాంతంలోని కొన్ని ప్రైవేటు వాహనాల ట్రాక్టర్ల హైడ్రాలిక్ పట్టీలను కూడా దొంగలు చోరీ చేసినట్లుగా సమాచారం. ఈ విషయమై గ్రామ కార్యదర్శి రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ దొంగలకు ఒక అవకాశం ఇద్దామని ఆలోచించి సోమవారం డప్పు చాటింపు నిర్వహించి గ్రామస్తులను ఆశ్చర్యానికి గురి చేశారు. మంగళవారం తెల్లారే వరకు గ్రామ పారిశుద్ధ ట్రాక్టర్ హైడ్రాలిక్ పట్టిని తీసుకువెళ్లిన స్థలంలోనే వేయాలని డప్పు చాటింపు ద్వారా ప్రచారం చేశారు. ఇంతకు క్రితం పంచాయతీకి చెందిన పైపులను సైతం దొంగలు ఎత్తుకు పోతే ఇలాగే డప్పు చాటింపు నిర్వహించి ఆ పైపులను రాబట్టారు. ప్రస్తుతం ఆమె ఇదే తరహా ప్రచారాన్ని చేసి కనపడకుండా పోయిన హైడ్రాలిక్ పట్టీని రాబట్టుకునే చర్యలు చేపట్టినట్లు అర్థమవుతోంది. మరి వేచి చూద్దాం రేపు ఏమవుతుందో. దొంగలలో సత్ప్రవర్తన గ్రామ కార్యదర్శి సంధ్యారాణి చేస్తున్న ప్రయత్నం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా సమాచార హక్కు చట్టం
# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**హన్మకొండ మహా;** సమాచార హక్కు చట్టం ఆవిర్భవించి 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో సమాచార హక్కు రక్షణ చట్టం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చిలువేరు కరుణాకర్ అధ్యక్షతన జరిగిన సభలో సమాచార హక్కు రక్షణ చట్టం స్టేట్ ఆర్గనైజర్ చెట్టబోయిన విద్యాసాగర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ మహమ్మద్ అమీర్ ఖాన్ హాజరైయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ దేశంలోని ప్రతి పౌరుడికి ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే తెలుసుకునే హక్కు ఉంది. ఆ హక్కును చట్టబద్ధం చేసిన శక్తివంతమైన అస్త్రమే సమాచార హక్కు చట్టం 2005. ఈ చట్టం దశాబ్దాల తరబడి సాగిన ప్రజా పోరాటాల ఫలితం, ముఖ్యంగా రాజస్థాన్లో మజూర్ కిసాన్ శక్తి సంఘటన్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం దీనికి ఊపిరి పోసింది. మా ఊరు, మా లెక్కలు అనే నినాదం పారదర్శకత ఆవశ్యకతను ప్రపంచానికి చాటిందని తెలిపారు.

**చట్టంలోని కీలక సెక్షన్లు:**

ఆర్టీఐ చట్టం యొక్క బలం దానిలోని కీలక సెక్షన్లలోనే ఉంది. సెక్షన్ 2(ఎఫ్):సమాచారం అంటే రికార్డులు, పత్రాలు, మెమోలు, ఫైల్ నోటింగ్స్ సహా ఎలక్ట్రానిక్ డేటా అంతా అని విస్తృతంగా నిర్వచిస్తుంది.

**సెక్షన్ 4:** ప్రభుత్వ కార్యాలయాలు తమ ముఖ్యమైన వివరాలను స్వచ్ఛందంగా ప్రచురించాలని నిర్దేశిస్తుంది. ఇది అవినీతిని నిరోధించే ప్రధాన సాధనం.

**సెక్షన్ 6:** ఏ పౌరుడైనా సమాచారం కోరవచ్చని. అందుకు కారణాలు చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తుంది.

**సెక్షన్ 7:** సాధారణ దరఖాస్తును వీలైనంత త్వరగా లేదా 30 రోజుల్లో, జీవe sతం లేదా స్వేచ్ఛకు సంబంధించిన సమాచారాన్ని 48 గంటలలో తప్పక అందించాలని గడువును నిర్ణయిస్తుంది.

**సెక్షన్ 7(5):** పేదలకు సమాచారం ఉచితంగా ఇవ్వాలని చెప్తుంది.

**సెక్షన్ 8:** దేశ భద్రత, వ్యక్తిగత గోప్యత వంటి కొన్ని మినహాయింపులను ఇస్తుంది. అయితే, ప్రజా ప్రయోజనం ఈ మినహాయింపుల కంటే ముఖ్యమైనదని చట్టం చెబుతుంది.

**సెక్షన్ 19 (8) బి** ప్రకారం కోరిన సమాచారం ఇవ్వకపోవడం, ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేయడం లాంటి చర్యలు ప్రభుత్వ అధికారులు చేస్తే, అలాంటి చర్యల వల్ల దరఖాస్తుదారుడు ఏ విధంగా అయినా నష్టపోతే ఆ నష్టాన్ని కూడా నష్టపరిహారం రూపంలో ప్రభుత్వం నుండి పొందవచ్చు.

సమాచార హక్కు రక్షణ చట్టం 2005 ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో చట్టంపై పౌరులకు అవగాహన కల్పిస్తూ, చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులకు కోర్టు తీర్పులతో సమాధానం ఇస్తూ, ఈ చట్టం అనేది ప్రభుత్వం మనకు ఇచ్చిన దయ కాదు, మన పౌరుల పోరాట ఫలం అని, ఈ చట్టం మన చేతిలోని శక్తివంతమైన రాజ్యాంగ సాధనం అని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారానే మనం నిజమైన, జవాబుదారీ ప్రభుత్వాన్ని నిర్మించగలమని, ప్రతి పౌరుడు తన హక్కును తెలుసుకోని, ప్రశ్నించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నాయకుల అభిప్రాయంతోనే నూతన అధ్యక్ష ఎంపిక
## డీసీసీ ఎంపికలో నూతన ఒరవడికి ఏఐసీసీ శ్రీకారం




**హన్మకొండ మహా;**ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే నేతృత్వంలో పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో గుజరాత్ వేదికగా ప్రారంభమైన కాంగ్రెస్ సంఘటన్ శ్రియన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా నూతన డీసీసీ (డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ)ఎంపిక ప్రక్రియ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకే ఉంటుందని వరంగల్, హనుమకొండ జిల్లాల ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్ ప్రకటించారు. సోమవారం హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాల అబ్జర్వర్ లుగా విచ్చేసిన దుర్గం భాస్కర్, మసూద్,రేణుక కో ఆర్డినేటర్ ఆదర్శ్ జైస్వాల్ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య , ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కే ఆర్ నాగరాజు ,ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు. హనుమకొండ జిల్లాలో ఉన్న అన్ని మండల ముఖ్య నాయకులు,మండల పార్టీ అధ్యక్షులు,బ్లాక్ అధ్యక్షులు తో పాటు కార్యకర్తల సూచనలు, అభిప్రాయాలు కీలకం అని అన్నారు. నూతన జిల్లా డీసీసీ అధ్యక్షుల నియామకం విషయంలో రానున్న ఎన్నికల్లో బాధ్యత కూడా ఉంటుందని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ గుజరాత్ రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని అదే తరహాలో దేశ వ్యాప్తంగా డీసీసీ ఎంపిక ఉంటుందని తెలిపారు.ప్రతి ఒక్కరి స్వేచ్ఛాయుత వాతావరణంలో కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి నియామకంలో తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చునని తెలిపారు. అనంతరం హనుమకొండ జిల్లా మండలాల నుంచి నాయకుల అభిప్రాయాలను, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. రానున్న గ్రామ,మండల,జిల్లా స్థాయి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం క్షేత్ర స్థాయిలో కృషి అవసరమని డీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్, ఈవి శ్రీనివాస్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు,జక్కుల రవీందర్ యాదవ్,విజయ శ్రీ ,పోతుల శ్రీమాన్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ,జిల్లా విభాగాల అధ్యక్షులు ,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరినీ కాపు కాసేది మున్నూరు కాపులే..

**బహుజనుల సహకారంతో రాజ్యాధికారం వైపు అడుగులు .. రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు**



**వరంగల్ హన్మకొండ మహా;** సందర్భాలను బట్టి ఎప్పుడైనా ఎక్కడైనా పదవులను, అధికారాన్ని త్యాగం చేసి అన్ని వర్గాలను కాపు కాసేది కేవలం ఒక మున్నూరు కాపులేనని రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్ అన్నారు. రాష్ట్రంలోని మున్నూరు కాపులు ఐక్యంగా బహుజనుల సహకారం తో రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని ఉమ్మడి వరంగల్ మున్నూరు కాపుల ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్ అన్నారు. వరంగల్ కుల చరిత్రలో కొండా మురళి చరిత్ర ఒక అధ్యాయం అని వారిని మున్నూరు కాపులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. తదుపరి మాజీ ఎమ్మెల్యేలు దాస్యం ప్రణయ్ భాస్కర్, వినయ్ భాస్కర్, నన్నపనేని నరేందర్ సేవలు నియోజకవర్గాల అభివృద్ధికి అందించిన సేవలు మరువ వద్దన్నారు. ముఖ్యంగా వారిని పార్టీల పరంగా చూడవద్దని వారు మన మున్నూరు కాపులని గుర్తుంచుకోవాలి. ఏది ఏమైనా కొండా మురళి దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేనందర్ వారి గౌరవాన్ని కాపాడుతూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వరంగల్ వజ్రా గార్డెన్లో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రావు పటేల్, అపెక్స్ కన్వీనర్ మీసాల చంద్రయ్య పటేల్ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు నీలం రాజు కిషోర్ పటేల్ తోపాటు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కార్యదర్శులు ఇతర పదాధికారులు, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నియోజకవర్గ కోఆర్డినేటర్లు మండల అధ్యక్షులు ముఖ్యమైన కుల పెద్దలందరూ ఈ సమావేశానికి హాజరు కావడం జరిగిందని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మెంబర్షిప్ డ్రైవ్ లో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి మున్నూరు కాపు కుటుంబ సభ్యులు అందరూ తప్పకుండా శాశ్వత సభ్యత్వం తీసుకోవాలని దానివల్ల రాబోవు రోజులలో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఆ కార్డ్ తో మున్నూరు కాపు హాస్పిటల్స్ లో మీ అందరికీ ఉపయోగాలు ఉంటాయని మీ అందరి సూచనలు సలహాలు తీసుకొని తప్పకుండా మున్నూరు కాపు కులాన్ని ఐక్యం చేయడానికి నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వరంగల్ ఎంతో ప్రసిద్ధిగాంచిందని ఇక్కడ ఉన్నటువంటి ప్రతి ఒక్క మున్నూరు కాపు ముద్దుబిడ్డకు ఎంతో ధైర్య సాహసాల తో పాటు ఐకమత్యం ప్రదర్శిస్తారని కొనియాడారు. ముఖ్యంగా వరంగల్ తో నాకు ఎంతో అవినాభావ సంబంధం ఉందని మాకు ప్రత్యేక అభిమానం కూడా ఉందని తెలిపారు. అపెక్స్ కన్వీనర్ మీసాల చంద్రయ్య మాట్లాడుతూ సంఘ నిర్మాణంలో నేను కీలకపాత్ర పోషిస్తానని తెలంగాణ రాష్ట్ర సంఘం భవన నిర్మాణం ఒక సంవత్సరం లోపల కొలిక్కి తీసుకొచ్చి భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఒకే కులం ఒకే సంఘం నినాదంతో సంఘం స్థాపించడం జరిగిందని భవిష్యత్తు లో కుల సంఘం మొత్తాన్ని ఐకమత్యం తీసుకువచ్చి సభ్యత్వాలు పూర్తయిన తర్వాత మూడు లక్షల మందితో హైదరాబాదులో మున్నూరు కాపు గర్జన నిర్వహిస్తామని తెలిపారు. తదనంతరం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు నీలం రాజు కిషోర్ మాట్లాడుతూ ఈ మెంబర్షిప్ డ్రైవ్ చేసుకుంటూ సంఘం వివరాలన్ని ఒక యాప్ లో పొందుపరిచి అందులో విభాగాల వారిగా డాక్టర్లు , లాయర్స్ విభాగాల వారీగా అందరికి అందుబాటులోకి తీసుకువస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుచూ రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపు ఒకే కులం ఒకే సంఘాన్ని స్థాపించి అన్ని పార్టీల వారిని ఐకమత్యం చేసి అందరికీ సేవలందించే విధంగా కృషి చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. అలాగే మున్నూరు కాపు కులం పై ఈ మధ్య కాలంలో కొంతమంది మీడియా పరంగా మున్నూరు కాపులు బీసీలు కాదని దుష్ప్రచారం చేస్తున్నారని దీన్ని రాష్ట్ర కార్యవర్గం ఆదిలోనే ఈ చెడు ప్రచారానికి అడ్డుకట్ట వేయాలని కోరారు.

## హన్మకొండ కలెక్టరేట్ లో మహిళా సిబ్బందిపై అత్యాచారయత్నం


**పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు..నిందితుడి పై ఎస్సీ ఎస్టి కేసు నమోదు**

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా సిబ్బందిపై మదమెక్కిన ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దిక్కుతోచని స్థితిలో కామాంధుడి బారి నుంచి చివరకు తప్పించుకుని ఆ మహిళ సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పై బాధితురాలి ఫిర్యాదు మేరకు సహ ఉద్యోగి లైంగిక వేధింపులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, తో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్స్పెక్టర్ రంజిత్ కుమార్ తెలిపారు. వివరాల్లోకెళ్తే.. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ లో సీనియర్ అసిస్టెంట్గా పని చేస్తున్న ఇర్ఫాన్ సోహెల్ కొన్నేళ్లుగా కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది పై గత కొంతకాలంగా ఇర్ఫాన్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అంతలోనే సోమవారం హనుమకొండ కలెక్టరేట్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ కేసు ను హన్మకొండ ఏసీపీ నరసింహారావు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారని ఈ ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిందితునికి శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ తెలిపారు.


## చెరువులు, వాగులు, కాలువలు
# వ్యవసాయానికి ప్రాణాధారలు

ఇరిగేషన్ వ్యవస్థ బాగుంటేనే రైతు బలపడతాడు

చెరువులు, కుంటలు కబ్జా చేస్తే చట్టరీత్యా చర్యలు.. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్, హన్మకొండ మహా;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలని ప్రతి ఎకరా చివరి ఆయకట్టు వరకు నీళ్ల అందించడమే ప్రధాన లక్ష్యంగా నేడు హన్మకొండ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్థానిక నియోజకవర్గ పరిధిలోని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సాగునీటి వనరుల పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణ, సేద్యానికి అవసరమైన నీటి సరఫరా సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచిస్తూ, ప్రతి చెరువు, కుంట, వాగు పటమును సక్రమంగా అప్డేట్ చేసి, రాబోయే వర్షాకాలానికి ముందే మరమ్మతు పనులు పూర్తి చేయాలని అన్నారు. ఇరిగేషన్ వ్యవస్థ బలోపేతం అయితేనే రైతు బలపడతాడని అందుచేత ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. చివరగా ప్రజల భాగస్వామ్యంతో నీటి వనరులను కాపాడి, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. చెరువులు, వాగులు, కాలువలు వ్యవసాయానికి ప్రాణాధారమని వాటిని సంరక్షించ బడితేనే రైతు సుఖంగా ఉంటాడని ప్రతి చెరువును శిఖం భూముల వరకు సర్వే చేయించి ఎటువంటి ఆక్రమణలు ఉండకుండా చూడాలని రైతులకు నీటి సరఫరా అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. తదుపరి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి ప్రదేశిక పర్యటనలు నిర్వహించి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని ఆదేశించారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వడ్లకొండ గ్రామ చెరువు కట్టను బలోపేతం చేయుట అలాగే కేబుల్ బ్రిడ్జి నిర్మాణం అవసరమని స్థానిక ప్రజలు సూచించడంతో, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించి వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, చెరువులు, కుంటలు, కెనాల్ పూడిక తీయుటకు కావలసిన నిధులు కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రత్యేకంగా D-8, D-9 కెనాల్ కింద ఉన్న గ్రామాలకు నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, పూడిక తీయుట పనులను వేగవంతం చేసి రైతుల చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎవరైనా చెరువులు, కుంటలు లేదా కెనాళ్ల పై ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అడ్డంకులు సృష్టించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు ఇలాంటి అక్రమాల పై నిశితంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఈఈ, డిఇలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



# ట్రాన్స్ఫర్ స్టేషన్ ల పనితీరు మెరుగుపడాలి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** ట్రాన్స్ఫర్ స్టేషన్ ల పనితీరు మెరుగుపడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో గల ఐసిసిసి కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి నగర పరిధి లోని ట్రాన్స్ఫర్ స్టేషన్ లలో కొనసాగుతున్న విధి నిర్వహణ ను ఐసిసిసి లో ఏర్పాటుచేసిన కెమెరాల ద్వారా పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు కమిషనర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పోతన నగర్ బాల సముద్రం లో గల ట్రాన్స్ఫర్ స్టేషన్ లకు అనుసంధానమైన కెమెరాలను ఆ ప్రాంతం లో కొనసాగుతున్న శానిటేషన్ నిర్వహణ విధానాన్ని స్క్రీన్ లపై పరిశీలించారు. ఈ సందర్భంగా చరవాణి ద్వారా సి ఎం హెచ్ ఓ, ఈ ఈ లతో కమిషనర్ మాట్లాడుతూ రెండు ట్రాన్స్ఫర్ స్టేషన్ లలో హుక్ లోడర్ల పని తీరు ఎలా ఉందని? అవి సరిగా పని చేస్తున్నాయా? చెత్త తరలింపు వాహనాలు ఎక్కువ సమయం ట్రాన్స్ ఫర్ స్టేషన్ లలో ఎందుకు నిలిచి ఉంటున్నాయని అడిగి తెలుసుకుకొని సూచనలు చేస్తూ చెత్త తరలింపు ఆటో వాహనాలు చెత్త ను డంప్ చేసి వెళ్ళిపోయేలా చూడాలని రెండు ట్రాన్స్ ఫర్ స్టేషన్ లలో ఉన్న అన్ని హుక్ లోడర్లు సమర్థవంతం గా పని చేసేలా చూడాలని అన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**వృద్ధులైన తల్లిదండ్రులకు పిల్లలు అండగా ఉండాలి.. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. స్వీకరించిన 80 అర్జీలలో అధికంగా రెవెన్యూ 40, జిడబ్ల్యూఎంసి 6, హౌసింగ్ 4, డి ఆర్ డి ఓ 4, మిగతా 26 దరఖాస్తులు వివిధ శాఖల దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందిస్తూ, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తూ తల్లిదండ్రుల పోషణ బాధ్యతలను విస్మరిస్తున్నారని వృద్ధులైన తల్లిదండ్రులు ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కు విన్నవించుకోగా, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి వారి పిల్లలకు చరవాణి లో సంభాషించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి గణపతి, ఆర్డీఓ ఉమారాణి, డిడబ్ల్యూ ఓ, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాల ఆధారిత వాతావరణ ప్రమాదాలను పరిష్కరించాలి

**వరంగల్ మహా;** వ్యర్థాల ఆధారిత వాతావరణ ప్రమాదాలను పరిష్కరించడం ద్వారా ఆరోగ్య సమానత్వాన్ని మెరుగు పరుచుటే లక్ష్యం గా సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏం ఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన దృశ్య మాధ్యమ సమీక్ష (ప్రజెంటేషన్) కార్యక్రమం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి హాజరైయ్యారు.

# కాళిక బార్‌లో యువకుల మధ్య ఘర్షణ

**ఘర్షణలో గాయపడ్డ ఓ వర్గం యువకులు**



**వరంగల్ మహా;** వరంగల్ ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశిబుగ్గ ప్రాంతంలో గల కాళిక బార్ షాప్ లో ఆదివారం రాత్రి ఇద్దరు యువకుల పై ఓ వర్గం యువకులు కత్తులతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. బార్ షాప్‌లో మద్యం సేవిస్తున్న ఇద్దరి పై కత్తులతో దాడి చేసి తీవ్ర గాయపర్చినట్లు తెలుస్తోంది. ఈ సంఘటన మొత్తం సీసీ కెమెరాలలో రికార్డు అయ్యింది. కాగా ఘటన పై లేటుగా స్పందించిన ఏనుమాముల పోలీసులు చివరకు బార్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేసామని ఎస్సై రాజు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం ప్రకారం ప్రతిరోజూ పదుల సంఖ్యలో యువకులు ఆయుధాలతో బార్ షాప్ ప్రాంతానికి చేరుకొని భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిని అదుపు చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు చెబుతున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గొడవలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులను గురి చేసే ఆకతాయిలు, రౌడీలుగా వ్యవహరించే యువకులకు గట్టిగా కౌన్సిలింగ్ ఇచ్చి నియంత్రణ కల్పించాలని ప్రజలు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సంఘటన పై వివరణ కోరేందుకు ఎనుమాముల ఇన్స్పెక్టర్ ను చరవాణిలో సంప్రదించగా ఆయన స్పందించక పోవడం గమనార్హం. అలాగే ఇరు వర్గాలలో ఓ వర్గం వరంగల్ తూర్పు కాంగ్రెస్ యువనేత దగ్గరికి పైరవి కొరకు వెళ్లారని తెలుస్తోంది.



## జవాబుదారీతో ప్రజల వినతులు
# పరిష్కరించాలి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** ప్రజలకు జవాబుదారిగా ఉండి గ్రీవెన్స్ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులు నిబద్ధతతో పని చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకార కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భం గా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా

1.ఇంజనీరింగ్....31
2.హెల్త్ & సానిటేషన్....04
3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)..05
4.టౌన్ ప్లానింగ్...26
5.నీటి సరఫరా....04

మొత్తం.... 70 గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఎస్ ఈ సత్యనారాయణ, సి హెచ్ ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, పన్నుల అధికారి రామకృష్ణ, తదితరులు, పాల్గొన్నారు.



## అభినయంతో అలరించిన
# చిన్నారి హితిక

**షాద్ నగర్, మహా:** అద్భుతమైన ఆహాభావాలతో, అభినయంతో అలరించిన చిన్నారి నృత్యం వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. దేవీ నవరాత్రుల సందర్భంగా మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సంగీత నృత్య నిరాజనం, హైదరాబాద్ నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. షాద్ నగర్ పట్టణానికి చెందిన 8 వ తరగతి విద్యార్థిని హితిక బ్రహ్మాంజలి అనే గానం పై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం పాటు ప్రదర్శించిన అహ భావాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది చిన్నారి హితిక ఇప్పటికే ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి పలువురి మన్ననలు పొందింది, ప్రభోదయ డాన్స్ & మ్యూజిక్ అకాడమి చెందిన గురువు రంజు ప్రవీణ వద్ద శిక్షణ తీసుకుంటుంది హితక, రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది కళాకారులూ ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అభిమానులను ఎంతగానో అలరించాలి. చిన్నతనం నుంచి నృత్య కలపై ఆసక్తి కలపరుస్తూ ఉన్న చిన్నారులను అభినందిస్తూ ప్రముఖ నాట్య గురువు సజని వల్లభనేని చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంస పత్రం అందుకుంది చిన్నారి హితిక.




# నేత్రదానం మహాదానం

**కంటి వైద్యులు ఆప్తాలమిక్ ఆఫీసర్ లయన్ ఏం. చంద్రశేఖర్**

**అమనగల్లు, మహా:** జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదేశానుసారంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు లయన్ రామ్ రెడ్డి ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని కంటి వైద్యులు ఎం. చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత దానం చేయాలని మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కల్పించాలని ఆయన అన్నారు. 50 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరు కళ్ళు మసకబారిన వారు కంటిచూపు మందగించిన వారు ప్రతి ఒక్కరు కంటి పరీక్ష చేయించుకోవాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు తమ కళ్ళను సూచి శుభ్రత పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. నేత్రదానం మహాదానం అని ఆయన అన్నారు. మనిషి మరణించిన 6 గంటల లోపు తమ కళ్ళను దానం చేస్తే మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కల్పించవచ్చునని ఆయన తెలిపారు. మనిషి మరణించిన తర్వాత కూడా తమ కళ్ళు జీవించి ఉంటాయని ఆయన అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రదానం చేయాలని కోరారు. ఈ శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 15 మందిని రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ కు తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, జిల్లా చైర్మన్ బి యాదయ్య, సంయుక్త కార్యదర్శి కొరివి వెంకటయ్య, ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మైమున బేగం, హెల్త్ సూపర్వైజర్ తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, క్లబ్ పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.



# దీపిక అడిగితే ఇవ్వాల్సిందే.. మేమూ మనుషులమే!


మిగతా ఇండస్ట్రీల మాదిరిగా సినీ పరిశ్రమ ఓ పద్ధతి ప్రకారం లేదు. ఇక్కడ పనిగంటలు కరెక్ట్‌గా ఉండవు. అన్నిచోట్లా ఉన్నట్లుగానే ఇక్కడ కూడా ఎనిమిది గంటలు పనిచేసే విధానాన్ని అనుసరించాలని బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కొంతకాలంగా డిమాండ్ చేస్తోంది. చిన్న, మధ్యతరహా సినిమాలకు ఈ డిమాండ్లు సెట్ అవుతాయేమో కానీ భారీ బడ్జెట్ చిత్రాలకు వీటిని ఫాలో అవడం కష్టం!

## దీపికా.. నాకు చాలా ఇష్టం

ఈ కారణం వల్లే స్పిరిట్, కల్కి 2898 ఏడీ వంటి సినిమాలు దీపిక చేజారిపోయాయి. దీపిక డిమాండ్ గురించి తాజాగా అర్జున్ రెడ్డి హీరోయిన్ షాలిని పాండే స్పందించింది. ఆమె మాట్లాడుతూ.. నాకు దీపికా పదుకొణె అంటే చాలా ఇష్టం. స్కూల్‌లో చదువుకునే రోజుల నుంచి తనను చూస్తున్నాను. ఆమె జర్నీని ఫాలో అయ్యాను. తనొక గొప్ప యాక్టర్. తనకు ఏది అవసరమో దాని గురించి నిర్భయంగా మాట్లాడుతుంది. మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని నొక్కి చెప్పింది. తనవల్లే మేమందరం మానసిక ఆరోగ్యం గురించి ఓపెన్‌గా మాట్లాడగలుగుతున్నాం.

## సినిమా

తను కోరుకున్నది తనకు దక్కాల్సిందేనని నా అభిప్రాయం అని చెప్పకొచ్చింది. అటు కొంకణ సేన్ శర్మ మాట్లాడుతూ.. మేమేం సర్జరీ చేసే డాక్టర్స్ కాదు కదా.. మేమూ మనుషులమే! మాకూ చిన్నపాటి బ్రేక్స్ కావాలి అని పేర్కొంది. షాలిని పాండే తొలి చిత్రం అర్జున్ రెడ్డితో బాగా పాపులర్ అయింది. తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేసింది. డబ్బా కార్టెల్ అనే వెబ్ సిరీస్‌లోనూ తళుక్కుమని మెరిసింది. ధనుష్ ఇడ్లీ కొట్టు మూవీలో కీలక పాత్ర పోషించింది. ఈ మూవీ అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఓ సినిమా చేస్తోంది.



# అల్లు అర్జున్ సంచలన నిర్ణయం

టాలీవుడ్‌లో ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, మహేష్‌బాబు, ఎన్టీఆర్, ప్రభాస్ వంటి వారందరికీ ఫ్యాన్స్ అసోసియేషన్స్ ఉన్నాయి. చిరు మినహా మిగిలిన అందరికీ వారసత్వంగా ఈ అసోసియేషన్స్ కొనసాగుతున్నాయి. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ కూడా సొంతంగా తన అభిమానుల సైన్యాన్ని రెడీ చేసుకోనున్నాడు. అందుకోసం అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ విషయం ఇండస్ట్రీలో చాలామందిని ఉత్సుకతను రేకెత్తించింది. ఇప్పటివరకు అల్లు అర్జున్ ఫ్యాన్స్ కూడా మెగా అభిమాన సంఘాల ద్వారానే పలు కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ, మెగా ఫ్యాన్స్ పలుమార్లు ఇప్పటికీ కూడా బన్నీ సినిమాలతో పాటు ఆయన్ను కూడా ట్రోల్స్ చేయడం జరుగుతూనే ఉంది. దీంతో బన్నీ అభిమానులు కూడా తమ శక్తికి మించి వారికి కౌంటర్స్ ఇస్తున్నారు. ఇప్పుడు తమకంటూ ఒక ఫ్యాన్స్ అసోసియేషన్స్ ఉండాలని వారు భావించినట్లు ఉన్నారు. అందుకే "Allu Arjun Fans Association" పేరుతో ఒక సంఘం ఏర్పాటైంది. ఈ క్రమంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారికంగా కమిటీ సభ్యులను ఎన్నుకుంది.

## సంధ్య థియేటర్ ఘటనతో మార్పు

అల్లు అర్జున్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంది. ప్రస్తుతం ఉన్న యూత్‌లో ఎక్కువ మంది ఆయన్ను అభిమానించే వారే ఉన్నారని చెప్పవచ్చు. కానీ, పుష్ప 2 విడుదల సమయంలో సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో తనకు అండగా ఫ్యాన్స్ లేరనే చెప్పాలి. ఈ కేసులో అరెస్టు అయినప్పుడు అల్లు అర్జున్ సరైన అభిమానుల సంఘం అవసరాన్ని గ్రహించాడని కొందరు చెబుతారు. పెద్ద సంఖ్యలో వ్యవస్థీకృత అనుచరులతో కూడిన ఒక టీమ్ తనకు అవసరమని ఆయన గుర్తించినట్లు ఇండస్ట్రీలోని తన సన్నిహితులు చెబుతున్నారు.ఆ సమయంలో బన్నీకి అధికారికంగా అభిమానుల సంఘం లేదు. దీంతో అతని తరుపున ప్రజలకు చెప్పాల్సిన విషయాన్ని సమర్థవంతంగా రీచ్ చేసేవారు లేరు. ఈ సంఘటనను ఛాన్స్‌గా తీసుకున్న కొందరు అతనిపై సోషల్‌మీడియాలో తీవ్రంగా ట్రోల్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారు. దీంతో ట్రోల్స్ చేసే వారి సంఖ్య మరింత పెరిగింది. అదే టైమ్‌లో తనకు కూడా ఒక బలమైన సంఘం ఉండుంటే ఇలా జరిగేది కాదని చెబుతారు. ఈ ఫ్యాన్స్ అసోసియేషన్స్ ద్వారా అల్లు అర్జున్ కూడా పలు సేవా కార్యక్రమాలు కూడా చేయాలనే ప్లాన్ ఉన్నట్లు సమాచారం. తనను అభిమానించే వారి కుటుంబాలకు తనవంతుగా సాయం చేసేందుకు ముందు వరుసలో ఉండాలనే ప్లాన్‌తో ఆయన ఉన్నారట.

## ఎన్టీఆర్ కోసం యుద్ధమే చేసిన అభిమాన సంఘాలు

సినిమా హీరోలకు ఏదైనా సమస్య వస్తే మొదటి బలంగా గొంతు ఎత్తేది అభిమాన సంఘాలే... రీసెంట్‌గా ఎన్టీఆర్ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ వివాదం గురించి చెప్పవచ్చు. తారక్ గురించి అతను చేసిన వ్యాఖ్యలకు ఆయన అభిమానులు విరుచుకుపడ్డారు. ఇప్పటికీ కూడా ఆ ఎమ్మెల్యే స్వేచ్ఛగా తిరగలేకుండా ఉన్నారు. అలా కొన్ని సందర్భాల్లో తమ హీరో కోసం వారు అండగా నిలబడుతారు.




# రామ్ నీ డెడికేషన్‌కు ఆశ్చర్యపోతున్నా.. భాగ్యశ్రీ బోర్సే


టాలీవుడ్ యాక్టర్ రామ్ పోతినేని అభిమానులను ఎంటర్‌టైన్ చేసేందుకు 'ఆంధ్ర కింగ్ తాలూకా' అంటూ రాబోతున్నాడని తెలిసిందే. RAPO 22గా మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీకి 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేం మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నాడు. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రం నవంబర్ 28న గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది రామ్ టీం. పాటలకు మంచి స్పందన వస్తుండగా.. మేకర్స్ టీజర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. రామ్ అభిమానులతోపాటు మూవీ లవర్స్‌కు అదిరిపోయే ట్రీట్ ఇవ్వబోతున్నట్టు టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. తన కోస్టార్ రామ్‌పై ప్రశంసలు కురిపించింది హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. రామ్ హార్డ్‌వర్క్, డెడికేషన్ ను ప్రశంసిస్తూనే.. అభిమానులే అతడి బలం అని చెబుతోంది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేసింది.

సాగర్‌లా నువ్వందించిన మ్యాజిక్ అనుభూతిని ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా పొందుతారా..? అని ఎదురుచూస్తున్నా. మీరు చేస్తున్న కృషి, మీ డెడికేషన్ చూసి ఆశ్చర్యమేస్తుంది. ఆంధ్రాకింగ్ తాలూకా నీ అభిమానులకు అతి పెద్ద విజయం.. అంటూ రాసుకొచ్చింది భాగ్యశ్రీ బోర్సే. ఇప్పడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ మూవీలో రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

రామ్ ఇందులో టాప్ హీరో ఆంధ్ర కింగ్ సూర్యకుమార్ అభిమానిగా కనిపించనున్నాడు. ఆంధ్ర కింగ్ తాలూకా గ్లింప్స్‌లో సినిమా రిలీజ్ రోజు తన అభిమాన హీరో స్టైల్‌ను అనుకరిస్తూ థియేటర్‌లోకి ఎంట్రీ ఇచ్చిన రామ్ 'ఆంధ్రాకింగ్ ఫ్యాన్స్ తాలూకా..' అంటూ యాభై టిక్కెట్లు అడగగానే.. మేనేజర్ టిక్కెట్లు ఇస్తాడు. దాంతో రామ్ ఫ్యాన్స్‌తో కలిసి సంబరాలు చేసుకుంటాడు.

రామ్ సూర్యకుమార్ అభిమాని పాత్రలో నయా అవతార్‌లో కనిపించబోతున్నట్టు గ్లింప్స్ హింట్ ఇచ్చేసింది. ఈ చిత్రానికి వివేక్-మెర్విన్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమాతో వివేక్-మెర్విన్ టాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు.





# నక్సలైట్‌గా ఆనంద్‌దేవరకొండ..

బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ Takshakudu. ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com